మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్రస్వామిని కర్ణాటక రాష్ట్ర హైకోర్టు జడ్జి శ్రీనివాస హరీష్ కుమార్ దర్శించుకున్నారు.

వ్యక్తమైన వ్యతిరేకత

- పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో వైసిపి ఓటమి - నిరుద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగుల్లో అసంతృప్తే కారణం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

అధికార పక్షంపై వ్యతిరేకత వ్యక్తమైంది. పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసిపి ఓటమిపాలైంది. నిరుద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగుల్లో రాష్ట్ర ప్రభుత్వంపై అసంతృప్తి కారణంగా టిడిపిని గెలుపు వరించింది...

పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలపై రాష్ట్ర వ్యాప్తంగా నెలకొన్న ఉత్కంఠకు తెర పడింది. రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపుతో టిడిపి అభ్యర్థి భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి గెలుపొందారు. పోలింగ్‌కు ముందు ఎన్నికల్లో గెలుపొందాలని అధికార పక్ష నాయకులు తీవ్ర ప్రయత్నాలు సాగించారు. ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ప్రలోభాలకు సైతం యత్నించారు. సర్వ ప్రయత్నాలు చేసినా పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో వైసిపి అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి ఓటమి పాలయ్యారు. ఈ తీర్పులో నిరుద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగులు కీలక పాత్ర పోషించారు. వారిలో రాష్ట్ర ప్రభుత్వంపై ఉన్న అసంతృప్తిని ఓటు రూపంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బహిర్గతం చేశారు. జగన్ మోహన్ రెడ్డి పాదయాత్ర సమయంలో ప్రతి ఏడాది జాబ్ కేలండర్ విడుదల చేసి ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. వైసిపి అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు పూర్తవుతున్నా జాబ్ కేలండర్ ద్వారా ఉద్యోగాల భర్తీకి చర్యలు తీసుకోలేదు. దీంతో ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులు వైసిపి ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించి కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేసేందుకు చర్యలు తీసుకుంటామని జగన్ పాదయాత్ర సమయంలో హామీ ఇచ్చినా ఆ మేరకు చర్యలు చేపట్టలేదు. సిపిఎస్ రద్దు చేస్తామని ఇచ్చిన హామీని తుంగలోతొక్కారు. జిపిఎస్ అంటూ కొత్త వాదనను ముందుకు తీసుకొచ్చారు. వీటిపై ప్రభుత్వ ఉద్యోగులు వైసిపి సర్కారుపై ఆగ్రహంతో ఉన్నారు. అన్నిటికంటే ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు ఇచ్చే పరిస్థితి లేదు. ప్రతి సారీ జీతాలను ఆలస్యం చేస్తున్నారు. దీంతో ఇఎంఐలు కట్టుకునేందుకు ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దానికి తోడు ఉద్యోగులకు టిఎ, డిఎ బకాయిలను చెల్లిస్తామని చెప్పి ఆ మేరకు చర్యలు తీసుకోలేదు.

గూడూరులో సంబరాలు జరుపుకుంటున్న టిడిపి నాయకులు

నియంతృత్వం దెబ్బ

జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం అవలంబిస్తున్న నియంతృత్వ విధానం దెబ్బ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పడింది. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించేవారిని జగన్ సర్కారు తీవ్రంగా అణచివేస్తోంది. ముందస్తు అరెస్టులు, హౌస్ అరెస్టులకు పాల్పడుతోంది. సభలు, సమావేశాలను నిషేధించేలా జిఒ 1ని తీసుకొచ్చారు. ప్రజలపై కూడా నియంతృత్వ విధానాలతో సామాన్యులపై కూడా పన్నుల రూపంలో భారాలను పెంచారు. వీటన్నిటి దెబ్బ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వంపై పడింది. గతంలో చంద్రబాబు నాయుడు వ్యవహరించిన విధానాల వల్ల టిడిపిని ఓడించి వైసిపికి ప్రజలు పట్టం కట్టారు. ఇప్పుడు జగన్‌మోహన్ రెడ్డి కూడా నియంతృత్వ విధానాలతో వ్యవహరిస్తుండటంతో పట్టభద్రుల్లో వ్యతిరేకత స్పష్టంగా కనిపించింది.

పట్టభద్రులు తిప్పికొట్టారు

జగన్ మోహన్ రెడ్డి ప్రజలను, నిరుద్యోగులను ఇబ్బంది పెట్టడం, జాబ్ కేలండర్ విడుదల చేయకపోవడం, నిరుద్యోగ భృతి ఇవ్వకపోవడం, ఉద్యోగులకు కనీసం జీతాలు కూడా సరిగ్గా ఇవ్వకపోవడం వంటి వాటి వల్ల వైసిపిపై వ్యతిరేకత వ్యక్తమైంది. డబ్బుతో ఓట్లు కొనుగోలు చేయడం వల్ల విజయం అనేది ప్రజాస్వామ్యంలో చెల్లదు. అందుకే దాన్ని పట్టభద్రులు తిప్పికొట్టారు. పిడిఎఫ్ అభ్యర్థితో కలిసి పనిచేయడం వల్ల రెండో ప్రాధాన్యత ఓటు వల్ల టిడిపి అభ్యర్థి గెలుపునకు దోహదపడింది. వైసిపికి వ్యతిరేకంగా కలిసి పనిచేయడంతో విజయం సాధించాం. కలిసుంటే కలదు సుఖం.

- పి.తిక్కారెడ్డి, టిడిపి మంత్రాలయం నియోజకవర్గ ఇన్‌ఛార్జీ.

అకాల వర్షం.. అపార నష్టం

- జిల్లాలో 1463 ఎకరాల్లో పంట నష్టం
- అత్యధికంగా మొక్క జొన్న నష్టం
- రంగుమారిని చేతికొచ్చిన పంటలు

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

అకాల వర్షానికి అపార నష్టం వాటిల్లింది. కర్నూలు జిల్లాలో 1463 ఎకరాల్లో వివిధ రకాల పంటలు దెబ్బతిన్నాయి. గురు,శుక్రవారాల్లో కురిసిన అకాల వర్షం రబీ రైతులకు అపారమైన నష్టాన్ని మిగిల్చిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. కర్నూలు జిల్లాలో గురువారం దాదాపు 10 మండలాల్లో వర్షం కురిసింది. అత్యధికంగా కల్లూరులో 40.2 మిల్లీమీటర్లు, కర్నూలు రూరల్ లో 10.2,కర్నూలు అర్బన్‌లో 9.8 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదయింది. శుక్రవారం ఆస్పరిలో 13.4 మిల్లీమీటర్లు, దేవనకొండ 5, కృష్ణగిరి 4.4 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదయింది. ఈ వర్షం అనుకోకుండా వచ్చినా రైతులకు మాత్రం నష్టాన్ని మిగిల్చిందని రైతులు వాపోతున్నారు. జిల్లాలో పిడుగు పాటుకు మేకలు కూడా మృతి చెందాయి.

జిల్లాలో 1463 ఎకరాల్లో పంట నష్టం

రెండు రోజుకు అకాల వర్షానికి జిల్లా వ్యాప్తంగా 1463 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. ఇందులో ఎక్కువగా మొక్కజొన్న 1357 ఎకరాల్లో, ఆముదం 93.9 ఎకరాలు, జొన్న 12 ఎకరాలు, మిరప, వేరుశనగ ,ఉల్లి తదితర పంటలు నష్టం జరిగిందన్నారు. వాస్తవానికి ఈ నష్టం ఇంకా ఎక్కువే ఉందని అధికారుల నామమాత్రపు నష్టాలు లెక్కకట్టి రైతులను నట్టేట ముంచుతున్నారని కొందరు రైతులు అంటున్నారు. జిల్లాలో చేతికి వచ్చిన పంటలు జొన్న, మొక్కజొన్న, వేరుశనగ, ఎండుమిర్చి, టమోటా పంటలు రంగు మారి ఎరుపు రంగు వస్తుందని తద్వారా పంట గిట్టుబాటు ధర లభించదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాలా పంటలు ఈదురు గాలులకు నేలకొరిగాయి. కర్నూలు మండలంలో మిలిటరీ కాలనీ, నూతనపల్లె నందనపల్లె గ్రామాల్లో మునగ చెట్లు నేలకొరిగాయి. మొక్కజొన్న పంట నేలవాలి నీటి తడిచింది. కష్టాల్లో ఉన్న రైతును మరింత నష్టాల్లోకి నెట్టింది. వర్షం తక్కువ నమోదు అయినా ఈ సమయంలో వర్షం నీరు వల్ల పంటలు రంగు మారి నాణ్యత తగ్గుతుందని, గిట్టుబాటు ధర లభించదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

మునగ తోట నెలకొరిగింది-కుమార్ రైతు.నందనపల్లె

ఈదురుగాలులకు మునగ పంట అంత నేలమట్టం అయింది. అనుకోని వర్షం అయిన విపరీతమైన గాలులకు చేతికొచ్చిన పంట తీవ్ర నష్టాన్ని ఇచ్చింది. దిగుబడి బాగా వస్తుందనుకుంటే వర్షం నష్టాన్ని మిగిల్చింది. రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.నష్ట పరిహారాన్ని అందించాలి. జిల్లా వ్యవసాయ అధికారి పిఎల్.వరలక్ష్మికి చరవాణి ద్వారా,రైతులకు జరిగిన నష్టానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని సమాచారం కోసం సంప్రదించగా ఫోన్ కూడా తీయలేని పరిస్థితుల్లో ఉన్నారు.

పకడ్బందీగా 'పది' పరీక్షలు

- కలెక్టర్ కోటేశ్వరరావు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

పదో తరగతి పరీక్షలను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ పి.కోటేశ్వరరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ... ఏప్రిల్ 3 నుంచి 18 వరకు పదో తరగతి పబ్లిక్ ఎగ్జామినేషన్స్ నిర్వహిస్తామని తెలిపారు. పరీక్షలు రాసే విద్యార్థులు ప్రశాంతంగా రాసేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాల్సిన బాధ్యత చీఫ్ సూపరింటెండెంట్, డిపార్టుమెంట్ ఆఫీసర్స్ పై ఉంటుందన్నారు. అలాగే జవాబు పత్రాలను స్పాట్ వాల్యుయేషన్ కేంద్రానికి, ఇతర మెటీరియల్‌ను డైరెక్టర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్ వారికి పంపించే వరకు చీఫ్ సూపరింటెండెంట్, డిపార్టుమెంటల్ ఆఫీసర్స్ బాధ్యత వహించాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. డిఇఒ రంగారెడ్డి మాట్లాడుతూ... చీఫ్ సూపరిండెంట్లు, డిపార్టుమెంటల్ ఆఫీసర్స్ పరీక్ష సమయానికి గంట ముందు స్టోరేజ్ పాయింట్‌కు చేరుకుని ప్రశ్నపత్రాలను ఎస్కార్ట్ సహాయంతో పరీక్ష కేంద్రాలకు తీసుకెళ్లాలని తెలిపారు. ఉన్నతాధికారులకు తెలియకుండా ఎట్టి పరిస్థితుల్లో ప్రశ్నపత్రాలను జిరాక్స్ చేసి వినియోగించరాదన్నారు. అనంతరం పిపిటి ద్వారా హాజరైన అధికారులకు పదవ తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణపై అవగాహన కలిగించారు. ఎగ్జామినేషన్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రభూషణ్, ఎడి శామ్యూల్ పాల్, డిప్యూటీ డిఇఒలు హనుమంతరావు, సుకుమార్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్స్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కోటేశ్వరరావు

ముగిసిన మండలి పోరు...

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

శాసనమండలి స్థానాల ఎన్నికల ప్రక్రియ ముగిసింది. ఉమ్మడి కర్నూలు జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానంతో పాటు పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించారు. వీటికి సంబంధించి 13న పోలింగ్ నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికల కోసం కర్నూలు జిల్లాలోని కర్నూలు, ఆదోని, పత్తికొండ ఆర్‌డిఒ కార్యాలయాల్లో పోలింగ్ నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా పట్టభద్రుల కోసం 74 పోలింగ్ కేంద్రాలు, ఉపాధ్యాయుల కోసం 27 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ నిర్వహించారు. 61,633 మంది పట్టభద్రుల్లో 77 శాతం మంది, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ స్థానానికి సంబంధించి జిల్లా వ్యాప్తంగా 5,391 మంది ఓటర్లు ఉండగా వారిలో 4,866 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 90.26 శాతం పోలింగ్ నమోదైంది. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి 1178 ఓట్లు ఉండగా 1136 ఓట్లు పోలయ్యాయి. స్థానిక సంస్థల స్థానాన్ని వైసిపి దక్కించుకుంది. వైసిపి అభ్యర్థి డాక్టర్ మధుసూదన్ విజయం సాధించారు. ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ స్థానంలో వైసిపి అభ్యర్థి రామచంద్రారెడ్డి గెలుపొందారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో టిడిపి అభ్యర్థి భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి విజయం సాధించారు.

అకాల వర్షం...అపార నష్టం : అకాల వర్షాలతో వ్యవసాయ, ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది. గురువారం బలమైన ఈదురు గాలులతో కురిసిన వర్షాలకు మొక్కజొన్న, జొన్న పంటలు నేలకొరిగాయి.. మామిడి పిందెలు రాలిపోయాయి. అరటి, బొప్పాయి, మునగ, టమాట పంటలకు నష్టం జరిగింది. కర్నూలు మండలంలోని జి. సింగవరం, ఆర్. కొంత లపాడు, పడిదెంపాడు, పసుపల, నందనపల్లె, బి. తాండ్రపాడు, దిన్నెదేవరపాడు, గార్గేయపురం ప్రాంతాల్లో వ్యవసాయ, ఉద్యాన పంటలకు నష్టం జరిగినట్లు ఆయా శాఖల అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. మొక్కజొన్న 1,257 ఎకరాలు, ఆముదం 93, జొన్న 12 ఎకరాల్లో కలిపి మొత్తం 1,363.55 ఎకరాల్లో వ్యవ సాయ పంటలకు నష్టం జరిగింది. బి. తాండ్రపాడు, గార్గేయ పురం, పసుపల గ్రామాల్లో అరటి 1.20 హెక్టార్లు, బొప్పాయి 1.20, మునగ 3.20, టమాట 1.40 హెక్టార్లలో నష్టం జరిగిందని ప్రాథమిక అంచనా వేశారు. ఉద్యాన పంటలకు రూ.17.50 లక్షలు, వ్యవసాయ పంటలకు రూ. కోటికి పైగా నష్టం జరిగింది. ఇది ప్రాథమిక అంచనా మాత్రమే నని అధికారులు చెబుతున్నారు. జిల్లావ్యాప్తంగా 3 వేల హెక్టార్లలో మామిడి సాగైంది. పిందెలు రాలిపోయాయని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

నిరాశ పరచిన బడ్జెట్ : ఈ బడ్జెట్‌లో జిల్లా ప్రజలను నిరాశపరచింది. ఉమ్మడి జిల్లాకు అరకొరగా నిధులను కేటాయించారు. సాగునీటి ప్రాజెక్టులకు నామమాత్రంగా నిధులను కేటాయించారు. కర్నూలు జిల్లా సాగునీటి ప్రాజెక్టులకు రూ.594.56 కోట్లు కేటాయించినట్లు బడ్జెట్‌లో పేర్కొన్నారు. విద్యా రంగానికి కూడా నామమాత్రంగా అంకెల్లో కేటాయింపులను చూపారు. క్లస్టర్ యూనివర్సిటీ భవనాల నిర్మాణానికి రూ.32.83 కోట్లు, రాయలసీమ యూనివర్సిటీకి రూ.7.93 కోట్లు, అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీకి రూ.5 కోట్లను కేటాయించారు. వైద్యం, పర్యాటక రంగానికి ప్రసిద్ధి చెందిన కర్నూలు జిల్లాకు ఆ రంగాల్లో ఎలాంటి కేటాయింపులూ చేయలేదు.

ది ఓరియన్ హై స్కూల్ వార్షికోత్సవం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

నగరంలోని గుత్తి పెట్రోల్ బంక్ సమీపంలో ఉన్న ది ఓరియన్ హైస్కూల్ పాఠశాల మొదటి వార్షికోత్సవ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్య క్రమానికి ముఖ్య అతిథిగా జి.పుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ జివిఎం మోహన్ కుమార్, రవీంద్ర విద్యా సంస్థల వ్యవ స్థాపకులు జి. పుల్లయ్య , సమగ్ర శిక్ష అభియాన్ అడిషనల్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ వేణుగోపాల్, సాయి, సుబ్బయ్య రవీంద్ర గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ కర్నూలు పిబివి సుబ్బయ్య , వైస్ ప్రెసిడెంట్ వెల్స్ భార్గవ్ హైదరాబాద్ కె.శ్రీనివా సులు, ఇస్రో సైంటిస్ట్ బెంగళూర్ ఉమామహేశ్వరరావులు పాల్గొన్నారు. సభకు పాఠశాల కరస్పాండెంట్ పిసిహెచ్ రమణ అధ్యక్షత వహించారు. ప్రతి విద్యార్థి తన మేధస్సుకు పదును పెట్టి ఈ ప్రపంచానికి గొప్ప ఆవిష్కరణలు అందజేయవచ్చు అని అతిథులు పేర్కొన్నారు. విద్యార్థులకు బహు మతులను ప్రదానం చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి.

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

కేక్ కట్ చేస్తున్న మేయర్, కార్పొరేటర్లు

రూ.506 కోట్లతో నగరాభివృద్ధి : మేయర్

నగర పాలకవర్గ ద్వితీయ వార్షికోత్సవ వేడుకలో మేయర్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరాన్ని రూ.506 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు నగర మేయర్ బివై. రామయ్య అన్నారు. పాలకవర్గం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా శనివారం మున్సిపల్ కార్యాలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. మేయర్, డిప్యూటి మేయర్, కార్పొరేటర్లు కేకును కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ జిల్లా ఇంఛార్జ్ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, ఎంపిలు సంజీవ్ కుమార్, పోచా బ్రహ్మానంద రెడ్డి, ఎమ్మెల్యేలు హాఫీజ్ ఖాన్, కాటసాని రాంభూపాల్ రెడ్డి, జరదొడ్డి సుధాకర్ల సహకారంతో నగరాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్నామని తెలిపారు. ఈ రెండేళ్లలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు, నగర పాలక నిధులు మొత్తం రూ.505.90 కోట్లతో చేపట్టిన రోడ్లు, డ్రైనేజీ, నీటి ప్రాజెక్టులు, భవనాలు, పార్కుల అభివృద్ధి, వీధిదీపాలు, సుందరీకరణ పనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, కార్పొరేటర్లు, కో ఆప్షన్ మెంబర్లు పాల్గొన్నారు.

ఎస్‌పి ఆకస్మిక తనిఖీ

-యుఐ కేసులు తగ్గించాలి-టెక్నాలజీతో సైబర్ నేరాలకు అడ్డుకట్ట
-సీజ్ చేసిన ప్రాపర్టీని త్వరితగతిన డిస్పోజ్ చేయాలి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్ : కర్నూలు నగరంలోని కర్నూలు ఒకటవ, మూడవ, నాల్గవ పట్టణ పోలీసుస్టేషన్లను శనివారం జిల్లా ఎస్‌పి సిద్ధార్థ్ కౌశల్ ఆకస్మికంగా తనిఖీలు చేశారు. పోలీసు స్టేషన్ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసుస్టేషన్లలో వివిధ కేసులలో పట్టుబడి సీజ్ చేసిన వాహనాలను త్వరితగతిన డిస్పోజ్ చేయడానికి కోర్టులకు ప్రతి పాదనలు పంపాలన్నారు. ఎప్పటికప్పుడు కేసులు డిస్పోజ్ చేయాలన్నారు. మహిళల పై జరిగే నేరాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మహిళల పై జరిగే నేరాల పై అధిక ప్రాధాన్యత ఇచ్చి, దర్యాప్తులు ముమ్మరం చేయాలన్నారు. మొబైల్ రికవరీలు బాగా చేయాలన్నారు. యుఐ కేసులు తగ్గించాలన్నారు. దిశ యాప్‌కు ఏమైనా ఫిర్యాదులు వస్తే సత్వరమే స్పందించాలన్నారు. ప్రజల ఫిర్యాదుల పట్ల త్వరితగతిన స్పందించాలన్నారు. వచ్చే ఉగాది, రంజాన్ పండుగల నిమిత్తం పోలీసు బందోబస్తు, పర్యవేక్షణ పటిష్టంగా ఉండాలన్నారు. పోలీసు అధికారులకు తగిన సూచనలు, సలహాలు చేశారు. పోలీసు స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అమాయక ప్రజలు సైబర్ నేరాలు బారిన పడకుండా చూడాలన్నారు. పాఠశాలల్లో, పబ్లిక్ ప్రదేశాలలో మహిళలపై జరిగే నేరాలు , ఆన్ లైన్, సైబర్ మోసాలు తదితర విషయాలపై అవగాహన కల్పించాలన్నారు. విండ్ పవర్(ఫ్రాడ్ యాప్స్) , లోన్ యాప్స్, ఫోన్ పే, గూగుల్ పే రివార్డులు అంటూ, ఇన్సురెన్సు ఫ్రాడ్స్ (భీమా) , వాట్సప్ లో ఫ్రీ ఓటిటి లింకులు పంపి మోసాలు, ఫేక్ ఇన్వేస్టిమెంట్ స్కీమ్స్, లాటరీ,ఒఎల్ఎక్స్ ఫ్రాడ్స్, గవర్నమెంట్ స్కీమ్స్ అంటూ మోసాలు , ఆధార్ , బ్యాంకు ఖాతా ఒటిపి నెంబర్ తెలుసుకుని అకౌంట్స్ హాక్ చేసి డబ్బులు దొంగలించడం , ఆన్ లైన్ లో ఆర్డర్ ఇవ్వకుండానే పార్సిల్ వచ్చిందటూ బురుడి, ఆర్డర్ క్యాన్సిలేసన్ కోసమని ఒటిపి అడిగి మోసాల వంటివి జరగకుండా చూడాలన్నారు. సైబర్ నేరాల పై ఫిర్యాదుకు జాతీయ సైబర్ క్రైం ఫోర్టల్ 1930 కు సమాచారం అందించి ఫిర్యాదు చేసే విధంగా ప్రజలకు సైబర్ నేరాల పై అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్‌పి వెంట కర్నూలు పట్టణ డిఎస్‌పి కెవి మహేష్, కర్నూలు ట్రాఫిక్ డిఎస్‌పి నాగభూషణం, కర్నూలు పట్టణ పోలీసుస్టేషన్ల సిఐలు శంకరయ్య, తబ్రేజ్, తిమ్మారెడ్డి ఉన్నారు.

వెంటనే బకాయిలు విడుదల చేయాలి

గిరి కుమార్ రెడ్డి జిల్లా చైర్మన్ జెఎసి అమరావతి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : ఉద్యోగులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఎపి జెఎసి అమరావతి జిల్లా చైర్మన్ గిరికుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఎపి జెఎసి అమరావతి ఆధ్వర్యంలో కొనసాగిన నిరసన కార్యక్రమంలో గిరి కుమార్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల పట్ల అలసత్వంగా వ్యవహరించడం సరైంది కాదన్నారు. ఉద్యోగులకు చెల్లించాల్సిన జిపిఎఫ్ లోన్ల బకాయిలు, ఇతర రిటైర్మెంట్ బెనిఫిట్స్ వెంటనే విడుదల చేయాలని కోరారు. ఏప్రిల్ 4లోగా ప్రభుత్వం స్పందించకపోతే తర్వాత ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని పేర్కొన్నారు. ఎపిజెఎసి అమరావతి యూనియన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పంచలింగాలలో టిడిపి విజయోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి అభ్యర్థుల ఘన విజయాన్ని పురస్కరించుకొని శనివారం సాయంత్రం కర్నూలు మండలం పంచలింగాల గ్రామంలో టిడిపి నాయకులు విజయోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ మేరకు పంచలింగాల గ్రామ సర్పంచి కష్ణ యాదవ్ మాధవి, ఎంపిటిసి కురువ నాగరాజు ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున బాణాసంచాను పేల్చి స్వీట్లను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ అరాచక పాలనకు ప్రజలు చరమగీతం పాడేందుకు సన్నద్ధం అయ్యారని, అందుకు ఈ ఎన్నికల ఫలితాలే రుజువుగా నిలుస్తాయన్నారు. పట్టభద్రులకు అధికార పార్టీ ఎన్ని ప్రలోభాలకు గురిచేసిన లొంగలేదన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచి బాబు నాయకులు సోమశేఖర్ నాయుడు, తిమ్మప్ప, కపాదానం, రఫీ, సంజీవ నాయుడు, వెంకట నాయుడు, షమీం భాష, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విజయోత్సవంలో పంచలింగాల టిడిపి నాయకులు

గూడూరులో టిడిపి సంబరాలు

కోడుమూరు : గూడూరు గ్రామంలో ఎమ్మెల్సీ అభ్యర్థి భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి గెలవడంతో స్థానిక నగర పంచాయతీ టిడిపి నాయకులు శనివారం మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రామాంజనేయులు ఆధ్వర్యంలో బాణా సంచాపేల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ వైస్ చైర్మన్ రామాంజనేయులు, కౌన్సిలర్లు రేమట సురేష్, కోడుమూరు షేషావలి, పౌలు భారీ ఎత్తున టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్లాకోమాపై అవగాహన అవసరం

-సుశీల నేత్రాలయలో గ్లాకోమా వారోత్సవాలు
-నేత్ర వైద్యులు డాక్టర్ పి సుధాకర్ రావు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్ : గ్లాకోమా వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సుశీల నేత్రాలయ ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ పి.సుధాకర్ రావు అన్నారు. శనివారం కర్నూలు నగరం బుధవారపేట సుశీల నేత్రాలయ ఆసుపత్రిలో సాయి ఎడ్యుకేషనల్ సొసైటీ, సుశీల నేత్రాలయ ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ గ్లాకోమా వారోత్సవాలను పురస్కరించుకొని గ్లాకోమా పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ పి.సుధాకర్ రావు మాట్లాడుతూ గ్లాకోమా అనే వ్యాధి ప్రాణాంతకం కాదని అయితే కంటి చూపు పూర్తిగా కోల్పోయే అవకాశం ఉందన్నారు. గ్లాకోమా అంటే నీటి శుక్లాలు లేదా నీటి కాసులు అని అంటారు. ఇది 40 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరి కంటిపై ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. గ్లాకోమాను ప్రాథమిక దశలోనే గుర్తిస్తే కంటి చూపు నిలబెట్టుకోవచ్చని తెలిపారు. కొన్ని దశలు దాటిన తర్వాత గుర్తిస్తే అలాంటి వ్యక్తులకు భవిష్యత్తులో చూపు కోల్పోకుండా చూడవచ్చన్నారు. అప్పటివరకు కోల్పోయిన చూపును తిరిగి రాదన్నారు. నీటి శుక్లాలు ఎలా ఏర్పడతాయని వాటిని ఎలా నివారించుకోవాలో ఆయన వివరించారు. ప్రపంచవ్యాప్తంగా ఒక కోటి 20 లక్షల మంది గ్లాకోమా బాధితులు ఉన్నారని తెలిపారు. ప్రధానంగా రాయలసీమ ప్రాంతంలో అలర్జీ ద్వారా కళ్ళను నలుపుకుంటారని దీనివల్ల కళ్ళు ఎర్రబడతాయని తెలిపారు. దీనికి కొందరు స్టెరాయిడ్ డ్రాప్స్ వాడతారని దీనివల్ల అప్పటికప్పుడు బాధ తగ్గినా మళ్లీ ఇబ్బందులు ఎదురవుతాయని వివరించారు. గ్లాకోమా స్పెషలిస్టు డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ ఒకసారి గ్లాకోమాను నిర్ధారిస్తే దాన్ని నియంత్రించవచ్చని, కోల్పోయిన చూపును తిరిగి తెప్పించలేమన్నారు. ఈ వ్యాధి వారసత్వంగాను శరీరంలో ఉన్న పరిస్థితుల వల్లను వచ్చే అవకాశం ఉందన్నారు. రెటీనా స్పెషలిస్ట్ డాక్టర్ శ్రీతేజ మాట్లాడారు. కార్యక్రమంలో గైనకాలజిస్ట్ డాక్టర్ సావిత్రి, డాక్టర్ నేహా సుధాకర్, సాయి ఎడ్యుకేషనల్ సొసైటీ సిబ్బంది సుశీల నేత్రాలయ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

బిల్లులు రావన్న అపోహలు వీడాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి- సి బెళగల్

మండలంలో జగనన్న ఇళ్ల బిల్లులు ఇక రావని అపోహలు వీడాలని ఎంపిడిఒ రాముడు లబ్ధిదారులతో అన్నారు. శనివారం బురాన్ దొడ్డిలో జగనన్న లే ఔట్‌ను తనిఖీ చేసి హౌసింగ్ ఎఇ సుమంత్ సమక్షంలో నిర్మాణాలను పరిశీలించారు. అక్కడ 45 ఇళ్ల నిర్మాణంలో ఉండగా అందులో బేస్ మెట్ స్థాయి -13, లెంటల్ స్థాయి -9, ఆర్‌సి స్థాయి -4, పూర్తి స్థాయి-8 గా ఉన్నాయని తెలిపారు. మండలంలో లబ్ధిదారులకు అపోహలు వీడేలా సకాలంలో బిల్లులు వేయాల్సిన అవసరం ఉందని సిబ్బంది రంగన్న, శాంతిలకు సూచించారు.

ప్రకృతిని కాపాడుకుంటే రోజూ ఉగాదే

- రైల్వే ఎస్‌పి చౌడేశ్వరి

ప్రశంసాపత్రం అందుకుంటున్న రక్తదాత

ప్రజాశక్తి - ఆదోని

గాలి, నీరు, నిప్పు, ఆకాశం, భూమి వంటి వనరులను పరిరక్షించుకుంటే రోజూ ఉగాదే అని రైల్వే ఎస్పీ కె.చౌడేశ్వరి తెలిపారు. శనివారం గుంతకల్లు పట్టణంలోని శ్రీసాయి మహిళా డిగ్రీ కళాశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సేవాతత్పరులకు శ్రీశోభ కృత్ నామ సంవత్సరం ఉగాది పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహించారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఎస్.హరి ప్రసాద్ యాదవ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులుగా హాజరైన రైల్వే ఎస్పీ చౌడేశ్వరీ మాట్లాడారు. అనంతరం విశిష్ట ఉగాది సేవా పురస్కారాలతో జనసేవా, సామాజిక సేవా సంస్థ కార్యదర్శి ఎమ్‌డి.సంతోష్ స్వామి రక్తదాతలను అవార్డులతో జెవివి నాయకులు ఘనంగా సన్మానించారు. లెజెండ్ బ్లడ్ ఆర్గనైజషన్ అధ్యక్ష, కార్యదర్శులు రంజాన్, హనుమంతు, గంగాధర్ నాయుడు పాల్గొన్నారు.

రైతులు వివరాలను సరిచూసుకోవాలి

- ఎఒ రాజా కిశోర్

వివరాలను ప్రదర్శిస్తున్న ఎఒ రాజా కిశోర్

ప్రజాశక్తి - గోనెగండ్ల

మండలంలోని రైతులందరూ గ్రామ రైతు భరోసా కేంద్రాల్లో తాము సాగు చేసిన పంటల వివరాలను సరిచూసుకోవాలని ఎఒ రాజా కిశోర్ తెలిపారు. శనివారం మండలంలోని అలువాల గ్రామంలో రైతులు సాగు చేసిన పంటల వివరాలను రైతు భరోసా కేంద్రం వద్ద ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 2022-23 రబీ సీజన్‌లో రైతులు సాగు చేసి, నమోదు చేసుకున్న పంటల వివరాలను రైతుల వారీగా ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల వద్ద ప్రదర్శించామని తెలిపారు. రైతులందరూ తమ పరిధిలోని రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శించిన జాబితాలో సాగు చేసిన పంటల వివరాలను సరిచూసుకోవాలని చెప్పారు. ఏమైనా తేడాలుంటే వెంటనే సంబంధిత వ్యవసాయ సహాయకునికి తెలియజేసి మార్పులు చేసుకోవాలని సూచించారు.

సాగు నీటి ప్రాక్టులకు మొండి చెయ్యి

- ఎల్‌ఎల్‌సి నీటి హక్కుదారుల సంఘం నాయకులు సాయిబాబా

సమావేశంలో మాట్లాడుతున్న శ్రీకాంత్ రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

రాయలసీమ సాగు నీటి ప్రాజెక్టులకు మొండి చెయ్యి చూపారని ఎల్‌ఎల్‌సి నీటి హక్కుదారుల సంఘం నాయకులు సాయిబాబా విమర్శించారు. శనివారం పట్టణంలోని ఆర్‌సిసి కార్యాలయంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రతాప్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబు మాట్లాడారు. పెండింగ్ ప్రాజెక్టులకు ఒక్క రూపాయి కూడా కేటాయించకుండా కేవలం నిర్వహణ వ్యయం కోసం నిధులు కేటాయించడం అన్యాయమని విమర్శించారు. పోలవరం పూర్తయితే 3 కోట్ల ఎకరాలకు నీరందుతుందని తెలిపారు. ఎడిఎ కన్వీనర్ ఆదినారాయణ మాట్లాడుతూ... రూ.2,79,279 కోట్లతో పెట్టిన బడ్జెట్‌లో సాగునీటికి కేవలం రూ.11 వేల కోట్లు కేటాయించడం విచారకరమన్నారు. వెనుకబడిన ప్రాంతం కోసం ఏర్పడిన ఎడిఎ కోసం ఎన్ని నిధులు కేటాయించారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఆర్‌సిసి వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడారు. వేదవతి, ఆర్‌డిఎస్ కుడి కాలువకు ఒక్క రూపాయి కేటాయింపులు లేని బడ్జెట్ నిరర్థకమని తెలిపారు. ఆదోనిలో ఉన్న పారిశ్రామిక రంగాన్ని కూడా విస్మరించడం దారుణమన్నారు. ఆర్‌సిసి ఆధ్వర్యంలో బడ్జెట్‌కు నిరసనగా త్వరలో విజయవాడలో దీక్ష చేస్తామని తెలిపారు. నాయకులు రాజ్ కుమార్, రవివర్మ, శాంతరాజు, పిఒడబ్ల్యు నాయకులు సుజ్ఞానమ్మ, కళావతి, ఎపిఆర్‌సిఎస్ నాయకులు సుభాష్, బసవరాజు, విశ్రాంత తహశీల్దార్ షేక్షావలీ పాల్గొన్నారు.

కాటికారుల సమస్యలపై ఉద్యమం

- కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్‌బాబు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

శ్మశానంలో గుంతలు తీసే కాటికాపరుల సమస్యలపై ఉద్యమిస్తామని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.ఆనంద్‌బాబు తెలిపారు. సమస్యపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఈనెల 20లోపు పరిష్కరించకపోతే, వల్లకాడు బతుకులు తమ వల్ల కాదంటూ గ్రామగ్రామాన తిరుగుబాటు ఉద్యమాన్ని నిర్వహిస్తామని హెచ్చరించారు. శనివారం పట్టణంలోని మార్కెట్ యార్డు వద్ద ఉన్న సుందరయ్య భవనంలో సమావేశం నిర్వహించారు. కెవిపిఎస్ మండల కార్యదర్శి బి.తిక్కప్ప అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆనంద్ బాబు మాట్లాడారు. రాష్ట్రంలో నేటికీ ఎలాంటి గుర్తింపు గాని, భరోసా గాని లేని వృత్తిగా కాటికాపరుల వృత్తి అని తెలిపారు. కరోనా కంటే భయంకరమైన రోగాలు ప్రబలి పూడ్చిన మృతదేహాల మధ్య నిరంతరం సంచరిస్తూ, సమాజం అంతటికీ అవసరమైన వృత్తిని భుజానేసుకుని మోస్తున్నా ఇప్పటికీ ఎవరూ గుర్తించకపోవడం దారుణమన్నారు. కాటికాపరులు, గుంతలు తీసేవారు, బేగరులు, సల్వాదులు, ఎటోళ్లు పేరు ఏదైనా.. అందరివీ అర్ధాకలి బతుకులేనని ఆవేదన వ్యక్తం చేశారు. కాటికాపరులందరినీ వయస్సుతో నిమిత్తం లేకుండా 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. శ్మశానంలో ప్రత్యేకంగా మరణ ధ్రువీకరణ రాసుకునేందుకు మరో ఇద్దరికి అదనపు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. కాటికాపరులందరికీ ప్రమాద బీమా, ఆరోగ్య బీమా కల్పించడంతోపాటు వృత్తి పరికరాలు, రక్షణ పరికరాలు ఇవ్వాలని కోరారు. అన్ని ప్రాంతాల్లో శ్మశాన స్థలాలు కేటాయించడంతోపాటు అవి కబ్జాకు గురికాకుండా రక్షణ కల్పించాలని తెలిపారు. ప్రతి శ్మశానానికీ ప్రహరీ, శ్మశానంలో షెడ్డు, బోరు వేయించి, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారానికి ఈనెల 20న విజయవాడ ధర్నా చౌక్ వద్ద జరిగే మహా ధర్నాకు కాటికాపరులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. గ్రామ అధ్యక్ష, కార్యదర్శులు పరమేష్, సిద్ధప్ప, నాయకులు రాము, మహారాజు, లాజర్, రంగప్ప, వీరేష్, భీమేష్, జీవా, ఏలియా, రామప్ప, గుండప్ప, ఈరన్న, అమరేష్, వీరస్వామి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఆనంద్ బాబు

నేడు జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షునికి సన్మానం

- మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు సురేష్

ప్రజాశక్తి - ఆదోని

జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు పెద్దకడబూరు రామాంజనేయులుకు ఆదివారం జరిగే సన్మాన సభను జయప్రదం చేయాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు కల్లుపోతుల సురేష్ కోరారు. శనివారం పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపి అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి దళితులను దృష్టిలో ఉంచుకుని పెద్దకడబూరు సర్పంచి మాల రామాంజనేయులును వైసిపి ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులుగా నియమించారన్నారు. జిల్లా, డివిజన్, మండల మాలమహానాడు నాయకులు, మండల అధ్యక్షులు, కార్యదర్శులు, యువజన విభాగం, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. జిల్లా గౌరవాధ్యక్షుడు తలారి ఆంజనేయులు, జిల్లా అధ్యక్షులు జైభీమ్ సాయిరామ్, ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జీ మధుబాబు, అడ్వయిజర్ కేశవ మాస్టర్, పట్టణ అధ్యక్షులు బొబ్బిలి, నందవరం మండల అధ్యక్షులు శ్రీనివాసులు, కృష్ణ, నాగరాజు, సాగర్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సురేష్

వైసిపికి చెంపపెట్టు : టిడిపి

ప్రజాశక్తి - ఆదోని

కష్టాల్లో మరోసారి చంద్రబాబును నమ్మి ఎమ్మెల్సీలను గెలిపించారని, ఈ విజయం వైసిపికి చెంపపెట్టు అని టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె కృష్ణమ్మ, జిల్లా ఉపాధ్యక్షులు మాన్వి దేవేంద్రప్ప, మాజీ ఎల్‌ఎల్‌సి ఛైర్మన్ బసాపురం రామస్వామి, బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుడిసె శ్రీరాములు తెలిపారు. శనివారం వారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మూడు రాజధానులు అన్న ముఖ్యమంత్రికి ముచ్చెమటలు పట్టించిన పట్టభద్రులు, ప్రభుత్వ ఉద్యోగులు, నిరుద్యోగులు చీకొట్టారని ఎద్దేవా చేశారు. టిడిపికి బహుమానంగా మూడు ఎమ్మెల్సీలు ఇచ్చిన పట్టభద్రులకు టిడిపి అధికారంలోకి రాగానే తగిన న్యాయం చేస్తుందని తెలిపారు. ఈ తీర్పు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి చెంపపెట్టు లాంటిదని పేర్కొన్నారు. టిడిపి నాయకులు విఎం.గోపాల్, బసాపురం శివయ్య స్వామి, సలకలకొండ శ్రీనివాసులు, పరశురాముడు పాల్గొన్నారు.

మరింత జోష్‌తో ముందుకెళ్దాం

- టిడిపి కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి భూపాల్ చౌదరి

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిపై ప్రజల్లో వ్యతిరేకత స్పష్టత అయిందని, ఇదే జోష్ తో ముందుకు సాగి పార్టీకి పూర్వ వైభవం తీసుకొద్దామని టిడిపి కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి భూపాల్ చౌదరి కోరారు. ఆదోని టిడిపి కార్యాలయంలో సంబరాలు చేసుకున్నారు. పట్టభద్రుల స్థానాలకు మూడు ఎమ్మెల్సీలను గెలిపించిన పట్టభద్రులు, ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. అంతకుముందు కార్యాలయ ఆవరణంలో భారీగా బాణసంచా పేలుస్తూ ఎన్‌టిఆర్ విగ్రహం వరకు బైక్ ర్యాలీ చేపట్టి, పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా భూపాల్ చౌదరి మాట్లాడారు. ప్రజల్లో వ్యతిరేకతను ఎవరూ అడ్డుకోలేరని అనేదానికి ఈ ఎన్నికలే నిదర్శనమని తెలిపారు. ఓటర్లను మభ్య పెట్టినా స్పష్టమైన ప్రజా తీర్పు వెల్లడైందన్నారు. వచ్చే ఎన్నికల్లో ఆదోని నుంచి ఎమ్మెల్యేగా మీనాక్షి నాయుడును గెలిపించుకొని, రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబును ఉంచే దిశగా కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని కోరారు. నాయకులు అప్సర్ బాష, రంగన్న, లక్ష్మీనారాయణ, వెంకటేష్, బసవ, కృష్ణారెడ్డి, ప్రతాప్ రెడ్డి, జయరాం, సజ్జాద్, వీరేష్, మహబూబ్ బాష పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

సమావేశంలో మాట్లాడుతున్న భూపాల్ చౌదరి

బోరులో నుంచి పారుతున్న నీరు

బూదూరులో బోరుకు మరమ్మతులు

- గ్రామానికి నీటి సరఫరా

- పంచాయతీ కార్యదర్శి వెంకటరత్నం

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని బూదూరు గ్రామానికి నీటి సరఫరా చేసే బోరు మరమ్మతులు పూర్తి కావడంతో నీటి సరఫరా చేయిస్తున్నామని పంచాయతీ కార్యదర్శి వెంకటరత్నం తెలిపారు. గత పది రోజులుగా గ్రామంలో నీటి సమస్య తీవ్రంగా ఉందని పత్రికల్లో వచ్చిన వార్తపై ఆయన స్పందించారు. శనివారం ఆయన మాట్లాడారు. బోరు మరమ్మతులకు రెండు కొత్త పైపులు అవసరమని, వాటి కోసం మండల, గ్రామీణ నీటి సరఫరా శాఖ ఎఇ వేద స్వరూపకు లేఖ ద్వారా ప్రతిపాదన పెట్టాల్సి ఉంటుందని ఆమె ఆదేశాలతో మండల కేంద్రం నుంచి తెప్పించి వేయాల్సి ఉంటుందని తెలిపారు. ఈ విషయంపై ఎంపిడిఒకు కూడా ఎఇ లేఖ రాసినట్లు చెప్పారు. ఎంపిడిఒ అంగీకారంతో కార్యాలయం సీల్‌తో కార్యాలయంలో ఇచ్చి పైపులు పొందాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఉన్న పైపులతో వేద్దామంటే గ్రామస్తులు వద్దని చెప్పారని తెలిపారు. ఇదంతా బోరు మరమ్మతులు చేసే రెడ్డప్ప ద్వారా ప్రతిపాదన ఉంటుందని పేర్కొన్నారు. ఈ తతంగం ఉన్నందున కాస్త ఆలస్యం జరిగిందని, ప్రస్తుతం నీటి సరఫరా జరుగుతోందని చెప్పారు. తమ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వార్తలు రాసే ముందు తమ వివరణ కోరాలని, అప్పుడే సమస్యకు గల కారణాలు తెలుస్తాయని పేర్కొన్నారు.

సాయిరాం హాస్పిటల్ ఆధ్వర్యంలో నేడు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఈనెల 19న పట్టణంలోని వీవర్స్ కాలనీ సాయిరాం హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సాయిరాం హాస్పిటల్ డైరెక్టర్ కె.శివన్న తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆదివారం తాలూకా పరిధిలోని గోనెగండ్ల పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిబిరంలో గర్భిణులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దగ్గు, జ్వరం, పక్షవాతం తదితర అన్ని వ్యాధులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. వివిధ వ్యాధులకు సంబంధించి వైద్య పరీక్షలతో పాటు, రక్త పరీక్షలు, స్కానింగ్, పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం ఉచితంగా మందులు ఇస్తామన్నారు. ఈ సదవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భూమిరెడ్డి గెలుపుపై టిడిపి సంబరాలు

ఆలూరులో మిఠాయి తినిపించుకుంటున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-ఆలూరు

పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీగా టిడిపి అభ్యర్థి భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి గెలుపొందడంతో ఆలూరు టిడిపి కార్యాలయంలో శనివారం మిఠాయి పంచుకొని సంబరాలు జరుపుకున్నారు. ర్యాలీగా వెళ్లి అంబేద్కర్ కూడలిలో బాణసంచా కాల్చి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర నాయకులు నారాయణ రెడ్డి, నారాయణ మాట్లాడారు. ముఖ్యమంత్రి స్వంత జిల్లా నుంచి టిడిపి ఎమ్మెల్సీని పట్టభద్రులు స్వచ్ఛందంగా ఓట్లు వేసి గెలిపించారని తెలిపారు. టిడిపి గెలుపు వైసిపి ప్రభుత్వ పతనానికి నాంది అన్నారు. టిడిపి మండల కన్వీనర్ అశోక్, జిలా నాయకులు భాస్కర్, నరసప్ప, నాగరాజు, కొమ్ము రామాంజి, మండల నాయకులు చంద్రశేఖర్, ముద్దు రంగా, మద్దిలేటి, విష్ణు, గూళ్యం రామాంజి, శివ, రఘురామిరెడ్డి, రాము, మసాల జగన్, రామ్మూర్తి, ఆనంద్, వెంకటేష్, లక్ష్మీపతి, బాలరాజు పాల్గొన్నారు.

ఆస్పరి : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీగా టిడిపి అభ్యర్థి భూమి రెడ్డి రాంగోపాల్ రెడ్డి గెలుపొందడం వైసిపికి చెంప దెబ్బ లాంటిదని సొసైటీ మాజీ డైరెక్టర్ కృష్ణ, టిడిపి మండల మాజీ కన్వీనర్ తిమ్మన్న తెలిపారు. అంబేద్కర్ సర్కిల్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి టిడిపి నాయకులు బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పట్టభద్రుల ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత బట్టబయలు అయిందన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారం దుర్వినియోగం, డబ్బు ప్రలోభాలకు గురి చేసినప్పటికీ పట్టభద్రుల ఓటర్లు టిడిపిని ఆదరించడం హర్షించదగ్గ విషయమని చెప్పారు. టిడిపి నాయకులు శ్రీనివాస్ గౌడ్, ముత్యాల రెడ్డి, రాఘవేంద్ర, రాజ్‌కుమార్, సతీష్, మహానంది, నాగన్న, మహేష్ పాల్గొన్నారు. **పెద్దకడబూరు**లో టిడిపి నాయకులు సంబరాలు జరుపుకున్నారు. తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంత రెడ్డి మాట్లాడారు. వైసిపి నాయకులు అధికార దుర్వినియోగం చేసినా, ప్రలోభాలు పెట్టినా టిడిపికి మద్దతు పలికినందుకు ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. **హొళగుంద**లో టిడిపి నాయకులు, కార్యకర్తలు బాణసంచా పేల్చి, మిఠాయిలు పంచుకుని సంబరాలు జరుపుకున్నారు.

గోనెగండ్ల : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం నుంచి టిడిపి అభ్యర్థి భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి విజయం సాధించడంతో టిడిపి నాయకులు గోనెగండ్ల టిడిపి కార్యాలయం వద్ద సంబరాలు చేసుకున్నారు. హోరాహోరీగా సాగిన ఓట్ల లెక్కింపులో టిడిపి గెలుపొందడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్యావంతులు, నిరుద్యోగులు, మేధావులు, ప్రజల్లో వైసిపి ప్రభుత్వం పట్ల ఉన్న వ్యతిరేకతకు ఈ విజయం నిదర్శనమని తెలిపారు. రానున్న 2024 సార్వత్రిక ఎన్నికల్లో కూడా రాష్ట్రంలో టిడిపి అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. స్థానిక టిడిపి కార్యాలయం వద్ద బాణసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. టిడిపి నాయకులు నజీర్ సాహెబ్, ఎన్‌వి.రామాంజనేయులు, వెంకట కృష్ణమనాయుడు, తిరుపతయ్య నాయుడు, రమేష్ నాయుడు, డి.నూర్ అహ్మద్, అడ్వకేట్లు చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, జిలాని బాష, కొత్తింటి అచ్చుగట్ల ఫక్రుద్దీన్, పూజారి రంగస్వామి పాల్గొన్నారు.

ఆస్పరిలో...

దేవనకొండ : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ టిడిపి అభ్యర్థి భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి గెలుపొందడం పట్ల టిడిపి నాయకులు సంబరాలు చేసుకున్నారు. టిడిపి మండల కన్వీనర్ విజయ భాస్కర్ గౌడ్ ఆధ్వర్యంలో సాయంత్రం బాణసంచా కాల్చి, డప్పు, వాయిద్యాలతో టిడిపి కార్యాలయం నుంచి ర్యాలీగా తరలివెళ్లి దేవనకొండ బస్టాండ్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. అలాగే తెర్నేకల్ గ్రామంలో మాజీ ఎంపిటిసి నాగేష్, నాయకులు లతీఫ్ ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. టిడిపి నాయకులు రామారావు నాయుడు, ఉచ్చీరప్ప, బడిగింజల రంగన్న, ఆకుల వీరేష్, మాలిక్ బాష, రాజా సాబ్, గిడ్డయ్య గౌడ్, చాంద్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

చిప్పగిరి : పశ్చిమ రాయలసీమ పట్టుభద్రుల ఎమ్మెల్సీ టిడిపి అభ్యర్థి భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి గెలుపుపై చిప్పగిరి మాజీ జడ్‌పిటిసి మీనాక్షి నాయుడు, టిడిపి మండల కన్వీనర్ లాయర్ షేక్షావలీ, మాజీ వైస్ ఎంపిపి వెంకటేశులు, మండల ఉపాధ్యక్షులు కోనంకి సతీష్, కుందనగుర్తి సర్పంచి కొండా పురుషోత్తం, మెల్దోనా మాజీ ఎంపిటిసి గోవిందు, టిడిపి దౌల్తాపురం యువ నాయకులు మేకల రామాంజనేయులు, హర్షం వ్యక్తం చేశారు. శనివారం వారు వేర్వేరుగా విలేకరులతో మాట్లాడారు. పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ టిడిపి ఎమ్మెల్సీ అభ్యర్థి రాంగోపాల్ రెడ్డి గెలుపు హర్షించదగిన విషయమని తెలిపారు. భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డికి ఓటు వేసిన ప్రతి ఒక్క పట్టుభద్రునికీ కృతజ్ఞతలు తెలియజేశారు. టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన అభివృద్ధి గెలుపునకు సోపానమని చెప్పారు. 2024లో టిడిపి అధికారంలోకి రావడం ఖాయమని, ఆలూరులో టిడిపి జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

నందవరం : పట్టభద్రుల ఎమ్మెల్సీ టిడిపి అభ్యర్థి భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డికి ఓటు వేసిన ప్రతి పట్టభద్రునికీ టిడిపి ఎల్లవేళలా రుణపడి ఉంటుందని మండల క్లస్టర్ ఇన్‌ఛార్జీలు, మాచాపురం మాజీ సర్పంచి ఖాసీం వలీ, గోపాల్, కన్వీనర్ చిన్న రాముడు, మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ వెంకట రామిరెడ్డి తెలిపారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. మండలంలో మాజీ ఎమ్మెల్యే బీవీ.జయ నాగేశ్వర రెడ్డి సహకారంతో ప్రతి గ్రామంలోనూ ముమ్మర ప్రచారం చేసినట్లు తెలిపారు. అందరి కృషి వల్ల పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో టిడిపి భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి విజయం సాధించారని చెప్పారు. పట్టభద్రులు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుపై ఎంతో నమ్మకంతో టిడిపికి ఓటు వేసి వేశారని తెలిపారు. 2024లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే నిరుద్యోగులకు ప్రత్యేక జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేస్తారన్నారు. 2018లో మాదిరే నిరుద్యోగ భృతిని రెట్టింపు చేసి, అందించేందుకు టిడిపి జాతీయ నాయకులు నారా లోకేష్ కృషి చేస్తారని తెలిపారు. టిడిపి నాయకులు గజేంద్ర రెడ్డి, శంకరమ్మ, జబ్బార్, శ్రీనివాస్ రెడ్డి, చంద్రశేఖర్, వీరారెడ్డి, వీరేష్, ఐటిడిపి నాయకులు వీరేష్, సోమన్న, ఆదిశేషు, పరశురాముడు పాల్గొన్నారు.

గోనెగండ్లలో సంబరాలు జరుపుకుంటున్న టిడిపి నాయకులు

దేవనకొండలో సంబరాల్లో టిడిపి నాయకులు

చిప్పగిరిలో మాట్లాడుతున్న మేకల రామాంజనేయులు

నందవరం ఖాసీం వలీ

ఎస్సీ వర్గీకరణ బిల్లు పార్లమెంటులో పెట్టాలి

- ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆనంద్ చైతన్య మాదిగ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి జి.ఆనంద్ చైతన్య మాదిగ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని ఎంఆర్‌పిఎస్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధతపై బిజెపి వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఎబిసిడి వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చిన బిజెపి మాట తప్పి మాదిగలను మోసం చేసిందని విమర్శించారు. ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 27, 28న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 3న ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాల్లో బిజెపి కార్యాలయాల ముందు మహా ధర్నా, ఏప్రిల్ 4న హైదరాబాదు, విజయవాడ నగరాలను, రహదారులను దిగ్బంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మెడలు వంచి తీరుతామని హెచ్చరించారు. ఎస్సీ వర్గీకరణ సాధన కోసం మాదిగలు మరో పోరాటానికి సిద్ధం కావాలని కోరారు. ఎంఆర్‌పిఎస్ నాయకులు బూదూరు ప్రకాశం, హాలహర్వి గాలెన్న, జయన్న, కంబాలదిన్నె జయరాజు, చిలకలడోన ప్రకాశం, బైలుప్పల వాసు, కంబాలదిన్నె శాంతి రాజు, సోగనూరు నథానియేలు, ఏసన్న, భూషణం, గంధాలం దుబ్బన్న, ప్రభాకర్, భాస్కర్, ఎంఎస్‌ఎఫ్ నాయకులు గిరిపోగు దివాకర్, పోతప్ప హరికృష్ణ, ఫారక్, రాజు, సూర్య ప్రకాష్, వంశీ పాల్గొన్నారు.

ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం చేయించుకోండి

- తహశీల్దార్ లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి - చిప్పగిరి

ఓటరు గుర్తింపు కార్డు పొందిన ప్రతి ఒక్కరూ ఆధార్ కార్డు నెంబర్‌తో అనుసంధానం చేయించుకోవాలని తహశీల్దార్ లక్ష్మీనారాయణ సూచించారు. శనివారం ఆయన తహశీల్దార్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఓటరు గుర్తింపు కార్డు పొందిన వారు అందుబాటులో ఉన్న సచివాలయానికి వెళ్లి ఆధార్ కార్డు నెంబర్‌తో అనుసంధానం చేయించుకోవడానికి ప్రత్యేక యాప్ ద్వారా ప్రభుత్వం అవకాశం కల్పించిందని తెలిపారు. ఓటరు జాబితాలో చనిపోయిన వారు పేర్లు ఉంటే వెంటనే తీసివేయడానికి అవకాశం ఉందన్నారు. సచివాలయ అధికారులందరూ ప్రజలకు అవగాహన కల్పించి ఓటరు అనుసంధానాన్ని పూర్తి చేయాలన్నారు. సీనియర్ అసిస్టెంట్ మధు స్వామి పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.1.03 కోట్లు

ప్రజాశక్తి - కౌతాళం

హుండీని లెక్కిస్తున్న సిబ్బంది

శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి హుండీ ఆదాయం రూ.1,03,50,779 వచ్చిందని దేవాలయ సహాయ కమిషనర్ రామాంజనేయులు తెలిపారు. శనివారం స్వామివారి హుండీని ఆదోని దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో లెక్కించారు. స్వామివారికి ఈ నగదుతో పాటు బంగారం 56 గ్రాముల 500 మిల్లీ గ్రాములు, వెండి 16 కిలోల 200 గ్రాములను భక్తులు సమర్పించుకున్నారు. దేవాలయ కమిటీ ఛైర్మన్ నాగరాజ్ గౌడ్, పాలకమండలి సభ్యులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తమైన వ్యతిరేకత

- పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో వైసిపి ఓటమి
- నిరుద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగుల్లో అసంతృప్తే కారణం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

అధికార పక్షంపై వ్యతిరేకత వ్యక్తమైంది. పశ్చిమ రాయల సీమ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసిపి ఓటమిపాలైంది. నిరుద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగుల్లో రాష్ట్ర ప్రభుత్వంపై అసంతృప్తి కారణంగా టిడిపిని గెలుపు వరించింది...

పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలపై రాష్ట్ర వ్యాప్తంగా నెలకొన్న ఉత్కంఠకు తెర పడింది. రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపుతో టిడిపి అభ్యర్థి భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి గెలుపొందారు. పోలింగ్‌కు ముందు ఎన్నికల్లో గెలుపొందాలని అధికార పక్ష నాయకులు తీవ్ర ప్రయత్నాలు సాగించారు. ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ప్రలోభాలకు సైతం యత్నించారు. సర్వ ప్రయత్నాలు చేసినా పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో వైసిపి అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి ఓటమి పాలయ్యారు. ఈ తీర్పులో నిరుద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగులు కీలక పాత్ర పోషించారు. వారిలో రాష్ట్ర ప్రభుత్వంపై ఉన్న అసంతృప్తిని ఓటు రూపంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బహిర్గతం చేశారు. జగన్ మోహన్ రెడ్డి పాదయాత్ర సమయంలో ప్రతి ఏడాది జాబ్ కేలండర్ విడుదల చేసి ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. వైసిపి అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు పూర్తవుతున్నా జాబ్ కేలండర్ ద్వారా ఉద్యోగాల భర్తీకి చర్యలు తీసుకోలేదు. దీంతో ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులు వైసిపి ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించి కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేసేందుకు చర్యలు తీసుకుంటామని జగన్ పాదయాత్ర సమయంలో హామీ ఇచ్చినా ఆ మేరకు చర్యలు చేపట్టలేదు. సిపిఎస్ రద్దు చేస్తామని ఇచ్చిన హామీని తుంగలోతొక్కారు. జిపిఎస్ అంటూ కొత్త వాదనను ముందుకు తీసుకొచ్చారు. వీటిపై ప్రభుత్వ ఉద్యోగులు వైసిపి సర్కారుపై ఆగ్రహంతో ఉన్నారు. అన్నిటికంటే ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు ఇచ్చే పరిస్థితి లేదు. ప్రతి సారీ జీతాలను ఆలస్యం చేస్తున్నారు. దీంతో ఇఎంఐలు కట్టుకునేందుకు ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దానికి తోడు ఉద్యోగులకు టిఎ, డిఎ బకాయిలను చెల్లిస్తామని చెప్పి ఆ మేరకు చర్యలు తీసుకోలేదు.

నియంతృత్వం దెబ్బ

జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం అవలంభిస్తున్న నియంతృత్వ విధానం దెబ్బ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పడింది. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించేవారిని జగన్ సర్కారు తీవ్రంగా అణచివేస్తోంది. ముందస్తు అరెస్టులు, హౌస్ అరెస్టులకు పాల్పడుతోంది. సభలు, సమావేశాలను నిషేదించేలా జిఒ 1ని తీసుకొచ్చారు. ప్రజలపై కూడా నియంతృత్త విధానాలతో సామాన్యులపై కూడా పన్నుల రూపంలో భారాలను పెంచారు. వీటన్నిటి దెబ్బ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వంపై పడింది. గతంలో చంద్రబాబు నాయుడు వ్యవహరించిన విధానాల వల్ల టిడిపిని ఓడించి వైసిపికి ప్రజలు పట్టం కట్టారు. ఇప్పుడు జగన్‌మోహన్ రెడ్డి కూడా ఇప్పుడు నియంతృత్వ విధానాలతో వ్యవహరిస్తుండటంతో పట్టభద్రుల్లో వ్యతిరేకత స్పష్టంగా కనిపించింది.

ప్రజలు మార్పును కోరుకుంటున్నారు

ప్రజలు మార్పును కోరుకుంటున్నారు. ప్రతి సంవత్సరం జాబ్ కేలండర్ విడుదల చేస్తామని, ఉద్యోగులకు టిఎ, డిఎ ఇస్తామని జగన్ చెప్పారు. ఇచ్చిన హామీలేవీ నెరవేర్చలేదు. పారిశ్రామిక అభివృద్ధి చేయలేదు. మూడు రాజధానుల పేరుతో ఎక్కడా అభివృద్ధి జరగకుండా చేశారు. దీంతో ప్రజలందరూ చంద్రబాబు నాయకత్వాన్ని కోరుకుంటున్నారు. అందుకే పట్టభద్రుల ఎన్నికల్లో టిడిపికి పట్టం కట్టారు.

- బిసి.జనార్ధన్ రెడ్డి, బనగానపల్లె టిడిపి ఇంఛార్జి

పది పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు

- ఉత్తీర్ణత కాదు... విద్యార్థులలో నాణ్యత అవసరం
- మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే క్రిమినల్ కేసులు
- జిల్లా విద్యాశాఖ అధికారి అనురాధ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లాలో పది పరీక్షల నిర్వహణకు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నామని పరీక్ష కేంద్రాల్లో అన్ని రకాల వసతులు కల్పిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి అనురాధ తెలిపారు. పది పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై శనివారం ఆమె ప్రజాశక్తితో మాట్లాడుతూ ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ఉపాధ్యాయులు గట్టి కృషి చేయాలన్నారు. ఉత్తీర్ణతే కొలమానం కాదని విద్యార్థుల్లో నాణ్యమైన విద్య అవసరమని కాబట్టి టీచర్లు విద్యార్థుల్లో క్వాలిటీ పెంచాలన్నారు. ఏప్రిల్ 3వ తారీకు నుండి 18వ తారీఖు వరకు జరిగే పది పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా 25411 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని అందులో విద్యార్థులు 22,661మంది, ప్రైవేట్ 3,750 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఉదయం 9:30 గంటల నుండి మధ్యాహ్నం 12:45 వరకు పరీక్షలు జరుగుతాయా న్నారు. పరీక్షల నిర్వహణకు జిల్లాలో 125 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని అందుకు 125 చీఫ్ సూపర్డెంట్లు, 125 మంది డిపార్ట్మెంటల్ అధికారులను ఏర్పాటు చేశామని, పరీక్షలను పటిష్టంగా పకడ్బందీగా నిర్వహించాలని ఎలాంటి మాస్ కాపీంగు జరగకుండా చూడాలని వీరికి జిల్లా కలెక్టర్ ఆదేశాలతో పలు సూచనలు సలహాలు ఇవ్వడం జరిగిం దన్నారు. చీఫ్ సూపరిండెంట్లు, డిపార్ట్మెంటల్ అధికారులను ఇన్విజిలేటర్లను, నాన్ టీచింగ్ సిబ్బంది క్లర్కులు మాత్రమే పరీక్ష కేంద్రాల్లో ఉండాలన్నారు. బయటి వ్యక్తులు తిరిగితే చీఫ్ సూపరింటెండెంట్‌లదే బాధ్యతన్నారు. పరీక్షా కేంద్రాల్లో ఫ్యాన్లు ఏర్పాటు, విద్యార్థులు కూర్చొని పరీక్షా రాయడానికి ఫర్నిచర్ ఏర్పాట్లు అలాగే నిరంతరాయం విద్యుత్తు ఉండేలాగా చర్యలు తీసుకోవడంతో పాటు కాంపౌండ్ వాల్లేని చోట బారి గేట్లు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారన్నారు. అందుకు అనుగుణంగా పనులు జరుగుతున్నాయని తెలిపారు. విద్యార్థుల సౌకర్యం కోసం ఆర్టీసీ బస్సుల సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. గతంలో 12 పేపర్లు ఉంటే ఈ ఏడాది 6 పేపర్లు ఉంటాయన్నారు.

ఏప్రిల్ 3 నుండి ఓపెన్ స్కూల్ పరీక్షలు

ఏప్రిల్ 3వ తారీకు నుండి 17వ తేదీ వరకు ఓపెన్ స్కూల్ పరీక్షలు జరగనున్నట్లు డిఇఓ అనురాధ తెలిపారు. ఈ పరీక్షలు మధ్యాహ్నం 2:30 గంటల నుండి 5:30 వరకు జరుగుతాయని 6 సెంటర్‌లలో పదవ తరగతి పరీక్షలు, 8 సెంటర్‌లలో ఇంటర్ పరీక్షలు జరుగుతాయాన్నారు. 18వ తేదీ నుండి 23వ తేదీ వరకు ప్రాక్టీకల్స్ 3 సెంటర్లలో జరుగనున్నట్లు తెలిపారు. ఓపెన్ స్కూల్ పరీక్షలకు 10వ తరగతి పరీక్షలకు 1,149 మంది విద్యార్థులు, ఇంటర్‌కు 1,653 మంది విద్యార్థులు రాయనున్నట్లు డీఈఓ వెల్లడించారు.

ముగిసిన మండలి పోరు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

శాసనమండలి స్థానాల ఎన్నికల ప్రక్రియ ముగిసింది. ఉమ్మడి కర్నూలు జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానంతో పాటు పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించారు. వీటికి సంబంధించి 13న పోలింగ్ నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికల కోసం నంద్యాల జిల్లాలోని నంద్యాల, ఆత్మకూరు, డోన్ ఆర్‌డిఒ కార్యాలయాల్లో పోలింగ్ నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా పట్టభద్రుల కోసం 61 పోలింగ్ కేంద్రాలు, ఉపాధ్యాయుల కోసం 30 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ నిర్వహించారు. 54,929 మంది పట్టభద్రుల్లో 42,310 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 77.03 శాతం పోలింగ్ నమోదైంది. ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ స్థానానికి సంబంధించి జిల్లా వ్యాప్తంగా 4,426 మంది ఓటర్లు ఉండగా వారిలో 2,631 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 94.01 శాతం పోలింగ్ నమోదైంది. స్థానిక సంస్థల స్థానాన్ని వైసిపి దక్కించుకుంది. వైసిపి అభ్యర్థి డాక్టర్ మధుసూదన్ విజయం సాధించారు. ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ స్థానంలో వైసిపి అభ్యర్థి రామచంద్రారెడ్డి గెలుపొందారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో టిడిపి అభ్యర్థి భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి విజయం సాధించారు.

అకాల వర్షం...అపార నష్టం : అకాల వర్షాలతో వ్యవసాయ, ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది. గురువారం బలమైన ఈదురు గాలులతో కురిసిన వర్షాలకు మొక్కజొన్న, జొన్న పంటలు నేలకొరిగాయి.. మామిడి పిందెలు రాలిపోయాయి. జిల్లాలో 4,906 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. 3121 హెక్టార్లలో మొక్కజొన్న 1347 హెక్టార్లలో వరి, 221 మినుము, 14 ప్రొద్దుతిరుగుడు, 67 కొర్ర, ఆముదం 20 హెక్టార్లలో దెబ్బతిన్నాయి. 3,193 హెక్టార్లలో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది. నందికొట్కూరు నియోజకవర్గంలోని నందికొట్కూరు, మిడుతూరు, జూపాడుబంగ్లా, పాములపాడు, పగిడ్యాల, కొత్తపల్లి మండలాల్లో 3200 ఎకరాల పండు మిరప, దాదాపు 8వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. వీటిలో 20 శాతం పంటలు కోత దశకు వచ్చాయి. వడగళ్ల దెబ్బకు మిరప కాయలు పూర్తిగా నేల రాలాయి. మొక్కొజొన్న నేలవాలడంతో కోతకు వీలులేకుండా పోయింది. ఆళ్లగడ్డ మండలంలో 1705 హెక్టార్లలో పంట నష్టం వాటిల్లింది. రుద్రవరం, ఉయ్యాలవాడ మండలంలోనూ పంటలు దెబ్బతిన్నాయి.

నిరాశ పరచిన బడ్జెట్ : ఈ బడ్జెట్‌లో జిల్లా ప్రజలను నిరాశపరచింది. ఉమ్మడి జిల్లాకు అరకొరగా నిధులను కేటాయించారు. సాగునీటి ప్రాజెక్టులకు నామమాత్రంగా నిధులను కేటాయించారు. కర్నూలు జిల్లా సాగునీటి ప్రాజెక్టులకు రూ.594.56 కోట్లు కేటాయించినట్లు బడ్జెట్‌లో పేర్కొన్నారు. విద్యా రంగానికి కూడా నామమాత్రంగా అంకెల్కో కేటాయింపులను చూపారు. క్లస్టర్ యూనివర్సిటీ భవనాల నిర్మాణానికి రూ.32.83 కోట్లు, రాయలసీమ యూనివర్సిటీకి రూ.7.93 కోట్లు, అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీకి రూ.5 కోట్లను కేటాయించారు. వైద్యం, పర్యాటక రంగానికి ప్రసిద్ధి చెందిన కర్నూలు జిల్లాకు ఆ రంగాల్లో ఎలాంటి కేటాయింపులూ చేయలేదు.

డ్రోన్ సర్వేను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్, కమిషనర్

భూ సర్వేతో ఆక్రమణకు చెక్

- మున్సిపల్ చైర్ పర్సన్, మున్సిపల్ కమిషనర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష రీ సర్వే ద్వారా భూ ఆక్రమణలకు చెక్కు పెట్టొచ్చని ప్రభుత్వ భూములు ఎన్ని ఉన్నాయో గుర్తించవచ్చని మున్సిపల్ చైర్ పర్సన్ షేక్ మాబున్నీ సా, మున్సిపల్ కమిషనర్ సి రవిచంద్ర రెడ్డి అన్నారు. శనివారం నంద్యాల ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల నందు జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష రీ సర్వేను డ్రోన్ ద్వారా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వం (రీ -సర్వే) ప్రోగ్రాం ద్వారా జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష రీ సర్వే ను డ్రోన్ ద్వారా నంద్యాల యూఎల్‌బిని 4 నుంచి 5 రోజుల్లోపు మొత్తం సర్వే నిర్వహించడం జరుగుతుందన్నారు. గత నాలుగు నెలల నుండి నంద్యాల పట్టణంలో సర్వే జరుగుతోందన్నారు. ఇప్పటివరకు 47,174 స్థలాలను గుర్తించామన్నారు. ప్రతి ఇంటికి సంబంధించిన భూమి భూమి విస్తీర్ణం వంటి వివరాలన్నీ పాసుబుక్ రూపంలో లబ్ధిదారులకు ఇవ్వడం జరుగుతుందని అన్నారు. యజమానుల ఇంటికి సంబంధించి ధ్రువీకరణ పత్రాలు ఇవ్వలేదని, కాబట్టి ఈ సర్వే ద్వారా సర్వే నెంబరు సబ్ డివిజను హక్కు దారుల వివరాలు మొత్తం ఈ బుక్‌లో పొందుపరచడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్, పోలీస్ డిపార్ట్మెంట్ ఎస్ఐ తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న మిర్చి పంట

4,906 హెక్టార్లలో పంట నష్టం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లాలో గురువారం కురిసిన అకాల వర్షాలకు జిల్లాలో దాదాపు 4,906 హెక్టర్లలో పంటలు నష్టం జరిగినట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. అందులో మొక్కజొన్న 3121, వరి 1,347, మినుము 221, సన్ ఫ్లవర్ 14, కొర్ర 67, ఆముదం 20, నువ్వుల నూనె గింజల పంట 76, కుసుభం నూనె పంట 40 హెక్టర్లు దెబ్బతిన్నది.

3,913 హెక్టర్లలో దెబ్బతిన్న ఉద్యాన పంటలు

జిల్లాలో వ్యవసాయ పంటలతో పాటు ఉద్యాన పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. అందులో మిరప పంట 3,095 హెక్టర్లలో దెబ్బతినగా, అరటి 54.8 హెక్టర్లు, మామిడి 17 హెక్టర్లు, పసుపు 12 హెక్టర్లు, పప్పా యి 9 హెక్టర్లు, కూరగాయలు 3 హెక్టర్లలో మొత్తం 3,193 హెక్టర్లలో పంట దెబ్బతినగా రూ.485.44 లక్షలు పంట నష్టం జరిగినట్లు ప్రాథమి కంగా అంచనా వేసినట్లు ఉద్యాన అధికారులు వెల్లడించారు.

దిగాలు పడ్డ రైతన్న : చేతికొచ్చిన పంట ఉరుములు, మెరుపులు, వడగండ్ల వర్షాలతో పంటలు దెబ్బతినడంతో రైతన్న దిగాలపడ్డాడు. రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టి చివరకు చేతికి వచ్చే సమయానికి అకాల వర్షాల వలన దెబ్బతినడంతో రైతు కోలుకోని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. ముఖ్య ంగా వర్షాల వల్లన జిల్లాలో మిరప, వరి, మొక్కజొన్న, మినుము,నువ్వుల గింజల పంటలు, కుసుభం నూనె వంటి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. జిల్లాలోని నంద్యాల ఆళ్లగడ్డ కోవెలకుంట్ల డివిజన్లలోని దొర్నిపాడు, సంజామల కోయిలకుంట్ల ఉయ్యాలవాడ, ఆళ్లగడ్డ, గోస్పాడు, సిరివెళ్ల, చాగలమర్రి, బండి ఆత్మకూరు, గడివేముల, బనగానపల్లి పంట నష్టం తీవ్రంగా ఉంది.

నేటి నుండి శ్రీశైలంలో ఉగాది మహోత్సవాలు

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైలం క్షేత్రంలో ఆదివారం నుండి ఉగాది మహోత్సవములు ప్రారంభమై 23వ తేదీ వరకు వైభవంగా జరగనున్నాయని దేవస్థానం కార్యనిర్వాహణాధికారి లవన్న శనివారం తెలిపారు. బ్రహ్మోత్సవం ప్రతిరోజు గంగాధర మండపం వద్ద నుండి నంది గుడి వరకు, నంది గుడి వద్ద నుండి బయలు వీరభద్ర స్వామి వారి వరకు, అక్కడ నుండి తిరిగి బయలుదేరి ఆలయంలోకి వైభవంగా జరగనున్నట్లు తెలిపారు.

భక్తుల రద్దీ: ఉగాది మహోత్సవాల సందర్భంగా శ్రీశైల క్షేత్రానికి కర్ణాటక, మహారాష్ట్ర, తదితర ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో భక్తులు శ్రీశైలం చేరుకుంటున్నారు. సుమారు 800 కిలోమీటర్ల నుండి పాదయాత్రగా కర్నూలు, నందికొట్కూరు, ఆత్మకూరు మీదుగా వెంకటాపురం నుండి నల్లమల అడవులలో నాగలూటి పెద్ద చెరువు దామర్లకుంట భీముని కొలను కైలాస ద్వారా అటకేశ్వరంలో మీదుగా శ్రీశైలం చేరుకుంటున్నారు. మార్గమధ్యంలో భక్తులకు ప్రతి గ్రామంలో స్వచ్ఛంద సంస్థగా అన్నదాన కార్యక్రమంలో అదేవిధంగా నల్లమల అడవులలో అటవీశాఖ సమన్వయంతో దేవస్థానం కావలసిన ఏర్పాట్లను చేశారు. దేవస్థానం చేసిన ఏర్పాట్లను ఇఒ లవన్న ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం జరుగుతుంది. క్షేత్ర పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

'ఉపాధి'కి రూ.257 : ఎపిడి

ప్రజాశక్తి - బేతంచెర్ల

జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు సరియైన కొలతలకు తగినట్టుగా సగటున ఒక రోజుకు వేతనము రూ.257 వర్తిస్తుందని ప్రతి కూలి సద్వినియోగం చేసుకోవాలని ఏపీడి శ్రీవిద్య అన్నారు. బేతంచర్ల మండల పరిధిలోని ఎం పెండకల్ గ్రామ పంచాయ తీలో జరుగుతున్న ఉపాధి పనులు స్టాగ్ పెంచ్ చెరువులో పూడికతీత, పండ్ల తోటల పెంపకం సంబంధించిన పనులను శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపీడీ శ్రీవిద్య మాట్లాడుతూ ఉపాధి కూలీలు సరైన కొలతలతో పని చేస్తే సరైన వేతనం పొందడానికి అవకాశం ఉంటుందన్నారు. ఏపీవో శేషన్న, ఈసీ సుబ్బానాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఏపీ డి శ్రీవిద్య

ప్రథమ చికిత్సపై అవగాహన ఉండాలి : డిఎఫ్ఒ

- సిపిఆర్‌పై ఫారెస్ట్ సిబ్బందికి అవగాహన

ప్రజాశక్తి - మహానంది

ప్రథమ చికిత్సపై సిబ్బంది అవగాహన పెంచుకోవాలని డిఎఫ్ఒ వినీత్ కుమార్ పేర్కొన్నారు. శనివారం నాడు ప్రథమ చికిత్స, సిపిఆర్ (హృదయ శ్వాస కోశ పునర్జీవ చర్య) తదితర అంశాలపై మహానందిలో ఫారెస్ట్ సిబ్బందికి 2రోజుల పాటు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అటవీశాఖ జిల్లా అధికారి వినీత్ కుమార్ మాట్లాడారు. మహానందిలో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో డిఎఫ్ఒ శిక్షణ పొందిన అటవీ సిబ్బందికి సర్టిఫికెట్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ చైర్మన్ దస్తగిరి పర్ల, జిల్లా కార్యవర్గ సభ్యులు ఉస్మాన్, రెడ్ క్రాస్ రాష్ట్ర ఫస్ట్ ఎయిడ్ ట్రైనర్ డా.చంద్రశేఖర్, కోఆర్డినేటర్ రాజునాయక్, డా.శివ, రేంజర్లు తదితరులు పాల్గొన్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో తిరుపతి స్విమ్స్ వైద్యశాలకు చెందిన గుండెకు సంబంధించిన డాక్టర్ చంద్రశేఖర్ ఈ సందర్భంగా అవగాహన కల్పిస్తూ సాధారణంగా ఈ విధానాన్ని కార్డియా పల్మినరీ రీసెర్చ్ స్టేషన్‌గా వైద్యుల పరిభాషలో వాడుతూ ఉంటారని తెలిపారు. అత్యవసర సమయాల్లో హృదయ శ్వాసకోశ పునర్జీవన చర్య (సిపిఆర్) చేయటంవల్ల ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. గుండెపోటు వచ్చిన సమయంలో గుండె భాగం నందు దాదాపు 100 సార్లు చేతులతో ఒత్తిడి చేయడం వల్ల 90 శాతం ప్రాణాలు కాపాడవచ్చన్నారు. తర్వాత ఆస్పిరిన్ టాబ్లెట్ ఇవ్వడం వల్ల కొంత సమయం ఉంటుందని వెంటనే సమీపంలోని వైద్యశాలకు తరలిస్తే ప్రాణాలు కాపాడవచ్చని ఫారెస్ట్ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో రేంజర్ శివకుమార్, డిఆర్ఓ సుబ్బయ్య, గార్డ్ ప్రతాప్, శ్రీనివాసులు, నంద్యాల, డోన్ రుద్రవరం తదితర ప్రాంతాలకు చెందిన ఫారెస్ట్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఎఫ్ఒ వినీత్ కుమార్

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఎంవి రామచంద్రారెడ్డి

ప్రభుత్వానికి, ఉపాధ్యాయులకు వారధిగా ఉంటా..

- ఎమ్మెల్సీ ఎంవి రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ప్రభుత్వానికి ఉపాధ్యాయులకు వారధిగా ఉంటూ ఉపాధ్యాయుల సమస్యలు, ప్రయివేట్ పాఠశాలల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని నూతనంగా ఎన్నికైన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవి రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం నంద్యాలలో అపుస్మా, పిఆర్‌టియూ ఉపాధ్యాయ సంఘాలు ఏర్పాటు చేసిన అభినందన సభలో ఎంవి రామచంద్రారెడ్డి పాల్గొని, విలేకర్లతో మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలే తన సమస్యలుగా భావించి బాధ్యతగా పనిచేస్తానన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానన్నారు. అనంతరం ఎమ్మెల్సీ ఎంవి రామ చంద్రారెడ్డికి అపుస్మా నాయకులు సుధాకర్, పిఆర్‌టియూ పట్టణ అధ్యక్షులు వెంకట రాముడు, అపుస్మా పట్టణ కార్యదర్శి ఇసాక్ బాషా, జిల్లా కార్యదర్శి దస్తగిరి, ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యం ఘనంగా సన్మానించారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ మంత్రి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

మండలంలోని కోట కందుకూరు గ్రామానికి చెందిన టిడిపి మద్దతుదారుడు నన్నేబై గారి మహబూబ్ బాషా కుమారుని వివాహ కార్యక్రమంలో మాజీ మంత్రి భూమా అఖిలప్రియ పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ హుస్సేన్ బాషా, మాజీ జెడ్పిటిసి చాంద్ బాషా, కాంట్రాక్టర్, టిడిపి యువ నాయకుడు నన్నే బై గారి జీలాన్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఫలితాలపై టిడిపి సంబరాలు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి గెలుపు పట్ల టిడిపి శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి. నంద్యాల పట్టణంలోని తెలుగుదేశం పార్టీ ఇంచార్జి మాజీ శాసనసభ్యులు భూమా బ్రహ్మానందరెడ్డి నివాసం వద్ద టీడీపీ నాయకులు, కార్యకర్తలతో సందడి వాతావరణం నెలకొంది. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీగా భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి గారి విజయాన్ని పురస్కరించుకొని మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి నివాసం వద్ద సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా నంద్యాల టిడిపి మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ గెలుపు కోసం కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు అభినందనలు తెలిపారు.

జగన్ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయి..
మాజీ మంత్రి భూమా అఖిల ప్రియ

వైఎస్‌ఆర్సిపి ప్రభుత్వం పైన వ్యతిరేకత పెరిగిందని, ఈ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని మాజీ మంత్రి అఖిలప్రియ అన్నారు.శనివారం నంద్యాల పట్టణంలో భూమా అఖిలప్రియ నివాసం వద్ద భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి విజయాన్ని పురస్కరించుకొని సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా భూమా అఖిలప్రియ మాట్లాడారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు ఏ వి ఆర్ ప్రసాద్ కొండారెడ్డి, మన్నే కృపాకర్ భాస్కర్ రెడ్డి, అజ్మీర్ చాంద్బాషా, మోహన్ రెడ్డి, సురేష్ జార్జి, శరత్ తదితరులు పాల్గొన్నారు. **కోవెలకుంట్ల :** వైసిపికి పట్టభద్రులు బుద్ధిచెప్పారని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గడ్డం రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలలో టిడిపి అధిక మెజార్టీ రావడంతో వైసిపి పతనం మొదలైందన్నారు. వైసిపి ఓట్లను కొనుగోలు చేస్తే గెలుస్తామని ధీమాతో ఎమ్మెల్సీ ఎన్నికలకు కోట్లు వెచ్చించిందన్నారు. అందుకు విరుద్ధంగా ఓటుకు నోటు తీసుకున్న అసలైన టిడిపి అభ్యర్థులకు ఓటు వేసి వారిని గెలిపించడం హర్షనీయమన్నారు. అనంతరం బైక్ ర్యాలీ నిర్వహించి టిడిపి కార్యాలయం వద్ద, గ్రామపంచాయతీ సర్కిల్ వద్ద, గాంధీ సెంటర్ వద్ద బానిసంచా పేల్చి స్వీట్లను పంచిపెట్టారు. మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గడ్డం నాగేశ్వర్ రెడ్డి,టిడిపి మండల అధ్యక్షుడు అమడాల మద్దిలేటి, వల్లంపాడు సర్పంచ్ జగదీశ్వర్ రెడ్డి,సౌదరదిన్నె వెంకటసుబ్బారెడ్డి, బిజిన వేముల డి హుస్సేనయ్య, చిన్న కొప్పెర్ల వెంకటసుబ్బారెడ్డి, వల్లంపాడు నారాయణరెడ్డి, గడ్డం అమర్నాథ్ రెడ్డి, మోహన్ రెడ్డి పాల్గొన్నారు. **చాగలమర్రి :** టిడిపి పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల అభ్యర్థి భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి విజయం సాధించడంతో చాగలమర్రిలో టిడి టిడిపి నేతల సంబరాలు మిన్నంటాయి. టిడిపి నంద్యాల డివిజన్ బీసీసెల్ స్పోక్ పర్సన్ సల్లానాగరాజు, టీఎన్టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గుత్తి నరసింహులు, మైనార్టీ జిల్లా నాయకులు కొలిమి ఉసేన్వలి ఆధ్వర్యంలో స్థానిక పాతబస్టాండు ఆవరణలో బాణసంచా పేల్చి సంబరాలు జరిపారు. మిఠాయిలు తినిపించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇక వైసిపి పతనం మొదలైందని అన్నారు. కార్యక్రమంలో తెదేపా మండల ప్రధాన కార్యదర్శి హనీఫ్, తెలుగు యువత అధ్యక్షులు మాబులాల్, నాయకులు కొలమిషరీఫ్, పట్టణ ఉపాధ్యక్షులు షాబుల్, తెదేపా నాయకులు, మౌలాలి, హనీఫ్, వేణుగోపాలరెడ్డి, ఐషీర్, నాగశేషు, మాజీ జెడ్పీటీసీ రామసుబ్బయ్య పాల్గొన్నారు. **ఆత్మకూర్:** భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి విజయం సాధించడంతో ఆత్మకూరు పట్టణంలోని తెలుగు తమ్ముళ్లు విజయోత్సవ వేడుకలను నిర్వహించుకున్నారు. కార్యాలయం నుండి గౌడ్ సెంటర్లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వరకు నినాదాలు చేసుకుంటూ ఎన్టీఆర్ విగ్రహం వద్ద పెద్ద ఎత్తున బాణాసంచారాలను తెలుస్తూ స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు శివప్రసాద్‌రెడ్డి, వేణుగోపాల్, అబ్దుల్లాపురం బాష, తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రామ్మూర్తి నాగేశ్వరరావు, నాయక్, సతీష్, షఫీ ఉల్లా, తదితరులు పాల్గొన్నారు.

సంబరాలు జరుపుకుంటున్న మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి, టిడిపి శ్రేణులు

తరువాయి 6లో..

క్రీడా దుస్తులను ప్రారంభిస్తున్న కాటసాని ఓబుల్ రెడ్డి

చదువుతో పాటు క్రీడల్లో నైపుణ్యం సాధించాలి

-కాటసాని ఓబుల్ రెడ్డి

ప్రజాశక్తి - బనగానపల్లె

యువత చదువుతో పాటు క్రీడల్లోనూ నైపుణ్యాన్ని సాధించాలని వైసీపీ యువ నాయకులు, ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తనయుడు కాటసాని ఓబుల్ రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో కాటసాని ఓబుల్ రెడ్డి వాలీ బాల్ టోర్నమెంట్ పోటీలను శనివారం ప్రారంభించారు.కాటసాని ఓబుల్ రెడ్డి మాట్లాడుతూ స్వర్గీయ కాటసాని నాగార్జున రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలతో పాటు క్రీడా పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. వాలీ బాల్ టోర్నమెంట్‌లో 22 జట్లు పాల్గొన్నాయి. మొదటి బహుమతికి రూ.30,000, రెండవ బహుమతి రూ.20,000, మూడవ బహుమతి రూ.10,000 ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమంలో స్టేట్ వాలీబాల్ క్రీడాకారుడు ,విశ్రాంత ఉద్యోగి కరిముల్లా, వైసిపి నాయకులు కష్ణా రెడ్డి, కాటసాని ఓబుల్ రెడ్డి యూత్ సభ్యులు సుదర్శన్ రెడ్డి,కోనేటి దుర్గా, అత్తార్ అఖిల్ క్రికెట్ శివ తదితరులు పాల్గొన్నారు.

మృతుడు బజార్ హమాలి వర్కర్స్ యూనియన్ మాజీ ప్రెసిడెంట్ సిపిఎం నాయకుడు ఎస్ కాసిం

హమాలి ఖాసిం మృతి తీరని లోటు : సిపిఎం

ప్రజాశక్తి - బేతంచెర్ల

బేతంచర్ల బజార్ హమాలి వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్ సిపిఎం మండల కమిటీ సభ్యుడు సయ్యద్ ఖాసిం మృతి సిపిఎంకి తీరని లోటు అని సిపిఎం సీనియర్ నాయకులు వై ఎల్లయ్య, బేతంచెర్ల మండల కార్యదర్శి ఆర్ ఈశ్వరయ్య అన్నారు. సయ్యద్ ఖాసిం గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం నాడు తెల్లవారుజామున మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సయ్యద్ ఖాసిం మృతదేహానికి సిపిఎం నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులు అర్పించి, ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ సయ్యద్ ఖాసిం బేతంచెర్ల బజార్ హమాలి వర్కర్స్ యూనియన్ నాయకుడిగా, బేతంచెర్ల సిఐటియు మండల నాయకుడుగా సిపిఎం కమిటీ సభ్యులుగా కొన్ని సంవత్సరాలుగా, ఎన్నో పోరాటాలలో పాల్గొని పార్టీకి ఎంతో సేవ చేశారన్నారు. కాశీను 2000 సంవత్సరంలో బజార్ హమాలి వర్కర్స్ యూనియన్ లో సభ్యుడుగా చేరి నాయకుడిగా ఎన్నో సేవలు చేశారనీ వారు కొనియాడారు. అంతేకాకుండా శాఖ సభ్యుడుగా ఉంటూ కోటపేటలో బజార్ హమాలీ వర్కర్స్ యూనియన్ లో పార్టీ సభ్యులను నాయకులను తయారు చేశారని వారు ఆయన చేసిన సేవలు మరువలేమన్నారు. సయ్యద్ ఖాసింకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కావేటి రాజు, వెంకటేశ్వర్లు, నర్సింలు, రాజబాబు, డబ్బాల హుస్సేన్, వలి బాష, రాముడు, నరసింహులు, నాగరాజు, మహమ్మద్, తదితరులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - ఆత్మకూరు

అడవులకు దగ్గరగా ఉన్న చెంచు గిరిజనులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి ఆరోగ్యంగా జీవించాలని ఆత్మకూర్ టిబి యూనిట్ సూపర్వైజర్ చెరుకు రవికుమార్ తెలిపారు. శనివారం కొత్తపల్లి మండలం గువ్వలకుంట్ల గ్రామం లోని పాలెంచేరువు, ఎర్రకుంట్ల గూడెంలో క్షయవ్యాధిపై విద్యార్థులకు ఉపాధి కూలీలకు అవగాహన కార్యక్రమం కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనులు చెడు వ్యసనాలకు బానిసలు కారాదు అన్నారు. చెడు వ్యసనాల వల్ల నూరేళ్ల జీవితం అర్థాంతరంగా ముగింపు ఉంటుందన్నారు. పాలెం చెరువు ప్రభుత్వ గిరిజన పాఠశాల అవరణంలో గిరిజనులకు,విద్యార్థులకు, ఎర్రకుంట్ల గూడెంలోని ఉపాధి హామీ కూలీలకు క్షయవ్యాధి లక్షణాలు గురించి వివరించారు. క్షయవ్యాధి శరీరంలో గోర్లకు,వెంట్రుకలు కాకుండా మిగతా భాగాలనింటికి సోకవ చ్చునని తెలిపారు. వ్యాధి తీవ్రతను బట్టి క్రమం తప్పకుండా 6 నుండి 18 నెలలు మందులు వాడటంతో వ్యాధి నాయమవుతుందని తెలిపారు. మద్యపానం, దూమపానం, గుట్కా వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని, పోషకాహారం తీసుకోవాలని గిరిజనులకు సూచించారు.ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సరితా, పాఠశాల ప్రధానోపాధ్యాయులు,గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని నందవరం గ్రామంలో పురాతన ఆలయమైన శ్రీ మద్దిలేటి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ పునర్నిర్మాణానికి గ్రామ పెద్దలు భూమి పూజ నిర్వహించారు. శనివారం నందవరం గ్రామంలో శ్రీ మద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి ఆలయ పునర్ నిర్మాణానికి గ్రామ పెద్దలు భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాణ్యం దశరథ రామిరెడ్డి, పాణ్యం గోపాల్ రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

రానున్న ఎన్నికలలో సత్తా చాటుతాం : వైసిపి

ప్రజాశక్తి - చాగలమర్రి : రానున్న ఎన్నికలలో వైసిపి సత్తా చాటుతుందని వైఎస్ఆర్సిపి రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి బాబూలాల్, ఎంపీపీ వీరభద్రుడు విమర్శించారు. శనివారం స్థానిక వైఎస్ఆర్సిపి కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికలలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధిక స్థానాలు కైవసం చేసుకున్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. పేద బడుగు బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని వారన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సోహెల్ వైఎస్ఆర్సిపి నాయకులు గేట్ల మహబూబ్ ముల్లా, ఖాదర్బాషా, ముల్లా అజీమ్ అబ్దుల్లా, షబ్బీర్, షరీఫ్, టోపీ బాషా, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతూ బాబూలాల్, ఎంపీపీ వీరభద్రుడు

రైతులు ఆధునిక వ్యవసాయంపై దృష్టి సారించాలి

ఉద్యాన పరిశోధన శాస్త్రవేత్త డాక్టర్ సుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి - మహానంది

రైతులు ఆధునిక వ్యవసాయంపై దృష్టి సారించి, వ్యవసాయ పద్ధతులు పాటిస్తూ పంటలను పండించుకోవాలని డాక్టర్ సుబ్రహ్మణ్యం అన్నారు. శనివారం మండలంలోని గాజులపల్లె గ్రామంలోని లాల్ స్వామి మకానం నందు రైతు అవగాహన సదస్సును వైసిపి నాయకులు కొండా మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. మహానంది వ్యవసాయ కళాశాల రావెప్ విద్యార్థులు, అనంత రాజుపేట విశ్వవిద్యాలయం ఉద్యాన విద్యార్థులు నిర్వహించిన వ్యవసాయ సాంకేతిక ప్రదర్శన- రైతు సదస్సు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉద్యాన పరిశోధన శాస్త్రవేత్త డాక్టర్ సుబ్రహ్మణ్యం హాజరయ్యారు. ఈసందర్భంగా శాస్త్రవేత్త డాక్టర్ సుబ్రహ్మణ్యం, పలువురు మాట్లాడుతూ రైతులకు వ్యవసాయంలో మేళకువలు, సేంద్రియ వ్యవసాయ విధానం, పురుగు మందుల వాడకం, సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులు, రైతులకు అనేక విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి నాగేశ్వర్ రెడ్డి,ప్రొఫెసర్ డాక్టర్ రూత్, హార్టికల్చర్ ఆఫీసర్ ఎం. శ్రీధర్,సీనియర్ సైంటిస్ట్ ఠాగూర్ నాయక్, గజ్జ పెద్దపకీరయ్య, గ్రామ రైతులు,రావేప్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న ఉద్యాన పరిశోధన శాస్త్రవేత్త డాక్టర్ సుబ్రహ్మణ్యం

యాగంటిలో 'ఊరంతా ప్రేమ కథ' చిత్రీకరణ

ప్రారంభించిన కాటసాని ఓబుల్ రెడ్డి

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని ప్రముఖ శైవక్షేత్రం యాగంటి శ్రీ ఉమామహేశ్వర స్వామి దేవస్థానంలో వైసీపీ యువ నాయకులు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తనయుడు కాటసాని ఓబుల్ రెడ్డి "ఊరంతా ప్రేమ కథ" షార్ట్ ఫిలింను క్లాప్ కొట్టి ప్రారంభించారు. శనివారం మండలంలోని యాగంటి శ్రీ ఉమామహేశ్వర స్వామి దేవస్థానంలో 'ఊరంతా ప్రేమ కథ' షార్ట్ ఫిలిం హీరో హీరోయిన్ మధ్య సన్నివేశాన్ని క్లాప్ కొట్టి కాటసాని ఓబుల్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఊరంతా ప్రేమ కథ సన్నివేశాన్ని డైరెక్టర్ జంబులయ్య (పబ్జి కుర్రాడు)తో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాటసాని ఓబుల్ రెడ్డి మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతంలో ఇంతవరకు జరిగినటువంటి ప్రేమ కథా చిత్రాలన్నీ సూపర్ హిట్ అయ్యాయన్నారు. యువతకు ఒక మంచి మెసేజ్ ఇవ్వాలని డైరెక్టర్ జంబులయ్యకు కాటసాని ఓబుల్ రెడ్డి సూచించారు. నియోజకవర్గంలో నిర్వహించే పూటింగ్‌లకు సహకారాలు ఉంటాయని తెలిపారు. ఈ సందర్భంగా డైరెక్టర్ జంబులయ్య (పబ్జీ కుర్రాడు) మాట్లాడుతూ వచ్చే నెల నుంచి పూర్తిస్థాయిలో చిత్రీకరణ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాటసాని ఓబుల్ రెడ్డి యూత్ సభ్యులు సుదర్శన్ రెడ్డి, శివకృష్ణ, ఫెరోజ్ ,దుర్గా, మమ్మదా,నందవరం గణేష్ యాదవ్, ఊరంతా ప్రేమ కథ షార్ట్ ఫిలిం యూనిట్ సభ్యులు సల్మా, సురేష్, సుభాష్ ప్రవీణ్, మహేంద్ర, చంద్రశేఖర్, డి. రాజు, అమ్మాజీ రామ్మోహన్ శర్మ, ప్రతిష్, ఎం జె హుస్సేన్, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యంతో చదవాలి : ఎస్ఐ

ప్రజాశక్తి - పాములపాడు

విద్యార్థులు తాము ఎంచుకున్న రంగంలో లక్ష్యంతో ముందుకు సాగినట్లయితే ఉన్నత శిఖరాలకు ఎదుగుతారని పాములపాడు ఎస్సై జి అశోక్ అన్నారు. మూడు రోజులుగా శ్రీ వివేకానంద విద్యా విహార్‌లో సైన్స్ ఫెయిర్ ప్రదర్శన శనివారం ముగిశాయి. ఈ కార్యక్రమానికి ఎస్ఐ అశోక్ హాజరై మాట్లాడారు. విద్యార్థులు వివిధ రకాల ప్రాజెక్టులను ఏర్పాటు చేశారు. ప్రతి విద్యార్థి తానేంచుకున్న వాటిపై అధికారులకు, పాములపాడు లోని ప్రదర్శన చేశారు. సందర్శించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మండల స్థాయి అధికారులకు, గ్రామ ప్రజలకు ఆంగ్ల భాషలో విద్యార్థులు ఎంతో క్లుప్తంగా వివరించిన తీరు ఆశ్చర్యానికి గురయ్యారు. విద్యార్థుల ప్రతిభను సందర్శకులు అందరూ ప్రశంసించారు. ప్రతిభ కనబరిచిన వారందరికీ పాములపాడు ఎస్సై అశోక్ చేతుల మీదుగా బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఆర్ ఎస్ ఆర్ గోపాల్, ఏవో ఆర్ ఎస్ ఆర్ దేవిక, పాఠశాల ఉపాధ్యాయులు బాలాజీ, ఆగ్రో ఏజెన్సీస్ ప్రొప్రైటర్ నాయని, మధుసూదన రావు, టిఎన్ఆర్ అధినేత నాగరాజు, మైనార్టీ రాష్ట్ర నాయకులు మోమిని ముస్తఫా, ముర్తుజా అలీ రుద్రవరం సర్పంచ్ రామస్వామి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేస్తున్న ఎస్ఐ అశోక్

స్వచ్ఛభారత్ కార్మికులకు వేతనాలు చెల్లించాలి : సిఐటియు

ప్రజాశక్తి - ఆత్మకూర్

స్వచ్ఛభారత్ కార్మికులకు నెలల తరబడి వేతనాల పెండింగ్లో ఉన్న వేతనాలు ఇవ్వాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు వి. యేసురత్నం, సిఐటియు పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఏం రజాక్, రామ్ నాయక్, సిఐటియు మండల కార్యదర్శి పి భాస్కర్ లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఆరు నెలల నుండి వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు స్వచ్ఛభారత్ కార్మికులు ఎదుర్కొంటున్నారన్నారు.

నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుదలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని స్వచ్ఛభారత్ కార్మికులకు, గుర్తింపు కార్డు ప్రభుత్వమే ఇవ్వాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించి ఉద్యోగ భద్రత కల్పించాలని వారు కోరారు. నేటికీ స్వచ్ఛభారత్ కార్మికుల పైన రాజకీయ వేధింపులు కొనసాగుతున్నాయని పని చేయించుకోవడానికి ఉన్న ఆత్రుత కార్మికులకు జీతాలు ఇవ్వడంలో లేదన్నారు. స్వచ్ఛభారత్ కార్మికులకు నెలకు రూ.10వేలకు తగ్గకుండా వేతనాలు ఇవ్వాలని, 680 జీవో వచ్చి మూడు సంవత్సరాలు కావస్తున్న నేటికీ జీవో అమలు పరచలేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛభారత్ కార్మికులకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

జాతీయ పోటీలకు ఎంపికైన విద్యార్థిని ని అభినందిస్తున్న దృశ్యం

జాతీయ పోటీలకు ఖలీల్ సిద్దిక్ పాఠశాల విద్యార్థి

ప్రజాశక్తి - నంద్యాల

స్థానిక నూనెపల్లి ఖలీల్ సిద్దిక్ పాఠశాలకు చెందిన 6వ తరగతి విద్యార్థి అనశ్ర జోయా 14 సంవత్సరాలలోపు తైక్వాండో రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రథమ స్థానం సాధించి జాతీయ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల కరాస్పాండెంట్ నసీమున్నిసా బేగం తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో శనివారం జరిగిన అభినందన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ నెల 12వ తేది విశాఖపట్నంలో జరిగిన రాష్ట్ర తైక్వాండో పోటీల్లో తమ పాఠశాల విద్యార్థి ప్రథమ స్థానం సాధించడం తమ పాఠశాలకే గాక ప్రభుత్వ పాఠశాలల కే గర్వకారణం అన్నారు.ఈ నెల 25వ తేదీన రాజస్థాన్ లో జరిగే జాతీయ పోటీల్లో కూడ విజయం సాధించి మన రాష్ట్రానికి, నంద్యాలకు పేరు తీసుకొని రావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కోచ్ అబ్దుల్ మజీద్, విద్యార్థిని ప్రత్యేకంగా సన్మానించారు. విద్యార్థినికి మరింత ప్రోత్సహిస్తూ 10వేల నగదు బహుమతిని అందజేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

'పది' ఉత్తీర్ణత కీలకం

- డిప్యూటీ డిఇఒ కృష్ణ ఫర్

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

ఉన్నత విద్యకు పదవ తరగతి ఉత్తీర్ణత కీలకమని డోన్ డిప్యూటీ డిఇఒ కృష్ణ ఫర్ అన్నారు. శనివారం కొలిమిగుండ్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. అనంతరం పాఠశాలలో జరుగుతున్న ఫేర్వెల్ పార్టీకలో ఆయన పాల్గొని, ఎంఈఓ జిలాని బాష, ప్రధానోపాధ్యాయులు సోమశేఖర్, వైవిఎస్ నారాయణరెడ్డి పది తరగతి విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అనంతరం పాఠశాలలోనే నూతనంగా నిర్మిస్తున్న గదులను ఆయన తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవిపై అవగాహన

ప్రజాశక్తి - రుద్రవరం

మండల కేంద్రంలో దీర్ఘకాలిక వ్యాధులపై అవగాహన కల్పించి, రుద్రవరం ఆటో యూనియన్ ప్రాంతం నందు ఉచిత రక్త పరీక్షలు శనివారం నిర్వహించారు. చైతన్య ఎడ్యుకేషనల్ అండ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆఫీస్ అధ్వర్యంలో రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు టెస్ట్ ఆల్ అనే అంశం మీద 'మీ హెచ్ఐవి స్థితి మీరు తెలుసు కోండి' అనే కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఐవి స్థితిని ప్రతిఒక్కరూ తెలుసుకుని వారి ఆరోగ్యం మరియు కుటుంబ సభ్యుల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని రుద్రవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ప్రసాదు పేర్కొన్నారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ ప్రశాంత్ అసిస్టెంట్ బలరాం నాయక్, చైతన్య ఎడ్యుకేషనల్ అండ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ సిబ్బంది ఉన్నారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన

ప్రజాశక్తి - చాగలమర్రి

మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలను జిల్లా ఇన్చార్జ్ వ్యవసాయ అధికారి జయదేవ్ పరిశీలించారు. మండలంలోని పెద్దబోధనం, చిన్నబోధనం, రాంపలె గ్రామాల్లో దెబ్బతిన్న మొక్కజొన్న, కొర్ర పంటలను ఆయన శనివారం పరిశీలించారు. భారీ వర్షానికి 733 హెక్టార్ల మొక్కజొన్న, 46 హెక్టార్లలో కొర్రపంట దెబ్బతినిందన్నారు. నష్టపోయిన రైతుల నివేదికను ప్రభుత్వానికి నివేదిస్తామని తెలియజేశారు. నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందేలా కషి చేస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో ఏడీఏ రామ్మోహన్రెడ్డి, సాంకేతిక వ్యవసాయ అధికారులు ఆయూబ్ బాష, ప్రభావతమ్మ, మండల వ్యవసాయ అధికారి రంగనేతాజీ, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి జయదేవ్

భక్తులపై తేనెటీగల దాడి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

నల్లమల అరణ్యంలో వెలిసిన నవ నరసింహంలో ఒకరైన శ్రీ జ్వాలా నరసింహ స్వామి దర్శనం కోసం వెళ్లిన పలువురు భక్తులపై అడవి తేనెటీగలు గుంపులు గుంపులుగా వచ్చి దాడి చేయడంతో భక్తులు భయంతో పరుగులు తీశారు. గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో పొగ వల్ల చెట్లపై ఉన్న తేనెటీగలు భక్తులపై దాడి చేశాయని వారు తెలిపారు. అడవి తేనెటీగల దాడిలో ఒక టూరిస్ట్ గైడ్, కొందరు భక్తులు గాయపడినట్లు తెలిపారు.

నష్టపోయిన రైతులకు న్యాయం చేయండి

ప్రజాశక్తి - సంజామల

మండలంలో కురిసిన అకాల వర్షానికి నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఆదుకొని న్యాయం చేయాలని శ్రీకాంత్ రెడ్డి, రామయ్య, వెంకటేశ్వర్ రెడ్డి, గంగన్న అనే రైతులు కోరారు. శనివారం వారు మాట్లాడుతూ మిరప పంట వేసి రైతులు కల్లాలలో ఆరవేసుకోవడంతో వర్షానికి తడిసిపోయాయని, చెట్టుకు ఉన్న కాయలన్నీ గాలికి నేల మీద పడ్డాయని ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు వారు అన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోండి

- ముఖ్యమంత్రికి వినతి పత్రం అందించిన విప్, ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

అకాల వర్షంతో ఆళ్లగడ్డ నియోజకవర్గంలో పంటలు నీట మునిగి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని శాసనమండలి విప్ గంగుల ప్రభాకర్ రెడ్డి, శాసనసభ్యులు గంగుల బిజేంద్రారెడ్డి సిఎం జగన్‌మోహన్‌రెడ్డికి దృష్టికి తీసుకెళ్లారు. శనివారం ముఖ్యమంత్రిని కలిసి విప్, ఎమ్మెల్యే పంట నష్టంపై వివరించారు. అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలను శాసనసభ్యులు గంగుల బ్రిజేంద్రరెడ్డి అసెంబ్లీ సమావేశాలు ఉన్నప్పటికీ నియోజకవర్గంలో పర్యటించి రైతులకు జరిగిన నష్టాన్ని స్వయంగా పరిశీలించారు. రైతన్నలు భారీగా నష్టపోయారన్న విషయాన్ని మండలి విప్, ఎమ్మెల్యే ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు ముఖ్యమంత్రి కూడా అందుకు సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్నింటి కంటే ముందు నియోజకవర్గ ప్రజా ప్రయోజనాలే తమకు ముఖ్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి తాము ఎల్లప్పుడూ కట్టుబడి ఉన్నామన్నారు.

పంట నష్టంపై ముఖ్యమంత్రికి వివరిస్తున్న ఎమ్మెల్యే, మండలి విప్

పాతబస్టాండ్ లో జన్మదినం సందర్భంగా అన్నదానం నిర్వహిస్తున్న మున్సిపల్ కో ఆప్షన్ మెంబర్ వైఎస్ఆర్.రఫి

ఘనంగా మున్సిపల్ చైర్మన్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-డోన్

పట్టణంలోని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ పుట్టినరోజు వేడుకలను సప్తశైల రాజేష్ మిత్ర బృందం ఘనంగా నిర్వహించారు. శనివారం డోన్ పట్టణంలోని పాత బస్టాండ్ నందు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ కో ఆప్షన్ మెంబర్ వైఎస్ఆర్. రఫి మాట్లాడుతూ మున్సిపల్ చైర్మన్‌గా ఉంటూ పట్టణంలో ప్రతి సమస్యను పరిష్కరిస్తూ పేదల ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని, సమస్య ఏదైనా పరిష్కరించడమే తన లక్ష్యం అని కొనియాడారు. గుణంలో మంచి మనసున్న వ్యక్తి అని కొని యాడారు. ఇలాంటి మంచి మనసున్న వ్యక్తి భవిష్యత్తులో మంచి పదవు లు రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఆర్ట్ రమణ, సతీష్, డంకేష్, భాస్కర్, దస్తగిరి,రాజేష్,షాషావలి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ మధుసూదన్‌కు ఘన సన్మానం

ప్రజాశక్తి - ఆత్మకూరు

నందికొట్కూరు పట్టణంలో రబ్బానీ కాంప్లెక్స్‌లో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్‌ను నందికొట్కూరు మున్సిపల్ వైస్ చైర్మన్ మొల్ల రబ్బానీ, కౌన్సిలర్ మొల్ల జాకీర్ హుస్సేన్, ఉండవెల్లి ధర్మారెడ్డి లు ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్సీ మధు సూధన్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో 6వ వార్డ్ ఇంచార్జి దేశెట్టి శ్రీనివాసులు,కడుమూరు గోవర్ధన్ రెడ్డి,పట్టణ మహిళా ప్రధాన కార్యదర్శి వనజ, పట్టణ వైస్సార్సీపీ నాయకులు రిటైర్డ్ ఎస్ ఐ జాన్ , తమడపల్లి విక్టర్, ముజీబ్,పఠాన్ రసూల్ ఖాన్, వైస్సార్సీపీ సోషల్ మీడియా కో-కన్వీనర్ పసుల శ్రీనివాసులు నాయుడు, అబ్బాస్,ఆఫ్రిద్, చంద్ బాషా తదిరులు పాల్గొన్నారు.

బాల అకాడమీలో నీలం రంగు ఆక్టివిటీ

ప్రజాశక్తి - నంద్యాల

బాల అకాడమీ పాఠశాలలో శనివారము నీలం రంగు ఆక్టివిటీ చిన్నారులు, ఉపాధ్యాయ బృందంతో ఎంతో ఆసక్తికరంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా చిన్నారులు నీలం రంగు దుస్తులు వేసుకొని నీలం రంగు ఆట వస్తువులు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా కరెస్పాండెంట్ ఎం.జి.వి.రవీంద్రనాథ్, ప్రిన్సిపల్ మాధవీలత మాట్లాడుతూ నీలం రంగు లోతు, విశ్వసనీయత, విశ్వాసం, మేధస్సు అర్థాలను సూచిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎం.జి.వి. రవీంద్రనాథ్, ప్రిన్సిపల్ మాధవి, లత, చిన్నారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నీలం రంగు వేడుకలు జరుపుకుంటున్న దృశ్యం

ఎమ్మెల్సీ ఫలితాలపై టిడిపి సంబరాలు

5వ పేజీ తరువాయి..

బనగానపల్లె : పట్టబద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి బలపరిచిన అభ్యర్థులు విజయం సాధించడంతో పట్టణంలోని టిడిపి కార్యాలయం వద్ద టిడిపి నాయకులు కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా టిడిపి వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షులు టంగుటూరి శీనయ్య మాట్లాడారు. పాత పాడు సర్పంచ్ బెడదల మహేశ్వర రెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షులు ఖాసింబాబు, టిడిపి బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దరాజుపాలెం భూషన్న, నాయకులు టిప్ టాప్ కలాం అల్తాఫ్ హుస్సేన్, జోలాపురం తిరుమలయ్య, పసుపల బాల నాయుడు, కె.వి రామిరెడ్డి, లాయర్ నాగేంద్ర రెడ్డి ఇల్లూరు కొత్తపేట వెంకట మాజీ సర్పంచ్ వెంకట సుబ్బారెడ్డి, నాయకులు పాల్గొన్నారు. **ప్యాపిలి:** టిడిపి నాయకులు వెంకటేశ్వర్ రెడ్డి, రామ్మోహన్ యాదవ్, సుంకయ్య, రామాంజనేయులు, ఖాజాపీర్, తదితరులు ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండు ఆవరణలో టపాకాయలు పేల్చి సంబరాలు చేసుకున్నారు. కొంగనపల్లి మధు, మధు,శీను, బాల రంగన్న, రామచంద్రుడు, ఆర్సి మద్దిలేటి పాల్గొన్నారు. **బండి ఆత్మకూర్ :** బండి ఆత్మకూరు టిడిపి మండల అధ్యక్షుడు నందిపాటి నరసింహారెడ్డి, శ్రీశైలం నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షుడు బి మల్లేశ్వర్ రెడ్డి, టిడిపి నాయకులు కంచర్ల చిన్న లింగారెడ్డి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ శ్రేణులు టపాకాయలు కాల్చి, స్వీట్లు పంచుకొని సంబరాలు చేసుకున్నారు. నాయకులు కంచర్ల మనోహర్ రెడ్డి, తోట శివయ్య సర్పంచులు వెలగల రామచంద్రుడు, పెద్దినేని పెద్దన్న, టిడిపి నాయకులు పాల్గొన్నారు. **ఆత్మకూరు :** నందికొట్కూర్ పట్టణంలోని టిడిపి కార్యాలయంలో పట్టణ టిడిపి నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ భాస్కర్ రెడ్డి, షకీల్ అహ్మద్, లాయర్ జాకీర్ హుస్సేన్, ముర్తుజావలి, నిమ్మకాయల మోహన్, తదితరులు పాల్గొన్నారు.**బేతంచెర్ల :** పట్టణంలో టిడిపి మండల కన్వీనర్ ఉన్నము ఎల్ల నాగయ్య, పట్టణ కార్యదర్శి షేక్షావల్లి చౌదరి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుండి పాత బస్టాండ్ వరకు మేళ తాళాలు బాణాసంచాలతో సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎల్ల నాగయ్య, షేక్షావల్లి చౌదరి మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి రవీంద్ర నాయక్, క్రిస్టియన్ రాష్ట్ర అధ్యక్షుడు మేకల నాగరాజు, బుగ్గాన పల్లి రమేష్, సురేష్, నాయకులు పాల్గొన్నారు. **కొలిమిగుండ్ల :** మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అంకిరెడ్డిపల్లికి చెందిన మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ రవి ప్రకాష్ రెడ్డి, కొలిమిగుండ్ల అందే రాము బొట్టు స్వామి, డిష్ గోపాల్, బెలూమ్ హుస్సేన్య్య, తదితరులు పాల్గొన్నారు.**డోన్ :** భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి శనివారం గెలుపొందడంతో డోన్ పట్టణ టిడిపి అధ్యక్షులు చాటకొండ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పట్టణంలో టిడిపి కార్యాలయం నుండి పాత బస్టాండ్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా టిడిపి అధికార ప్రతినిధి విజయ్ బట్,డోన్ నియోజకవర్గ టిడిపి యువ నాయకులు ధర్మవరం గౌతమ్ రెడ్డి,నంద్యాల జిల్లా టిడిపి టీ ఎన్ టి యు సి అధ్యక్షులు అజీజ్,జిల్లా బిసి నాయకులు మల్లెంపల్లె జయ్యన్న,క్లస్టర్ ఇంచార్జ్ మిద్దెపల్లె గోవిందు,యాపదిన్నె సర్పంచ్ రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. **అవుకు:** టిడిపి సీనియర్ నాయకులు ఐవి పక్కిరా రెడ్డి ఆధ్వర్యంలో రామాపురం గ్రామంలో స్వీట్లు పంచుకొని సంబరాలు చేసుకున్నారు.

చాగలమర్రి: సంబరాలు జరుపుతున్న టిడిపి నాయకులు

కోవెలకుంట్లలో..

ప్యాపిలిలో..

బండిఆత్మకూరులో..

బనగానపల్లె : సంబరాలు నిర్వహిస్తున్న టిడిపి నాయకులు